ఆదివారం

ప్రజాశక్తి

జనవరి 4, 2004



అమెరికా హింసా కేంద్రం 'గ్వాంటనామా'

హ్యాపీ బర్త్‌డే

(4-1-2004నుండి 10-1-2004వరకు)

ఎం. రాహుల్
4సం॥, జనవరి-2000
శివజ్యోతి-నరేందర్

జి. రాహుల్ రిచర్డ్స్
5సం॥, జనవరి-1999
అనితారాణి-సుందర్‌కుమార్
భీమవరం-ప॥గో॥

ఆర్.ఝాన్సీరాణి
4సం॥, జనవరి-2000
జ్యోతి-దుర్గప్రసాద్
సావరకోట-శ్రీకాకుళం

బి. పృథ్విసచిన్
చంద్రకళ-నిక్సన్
కొత్తకోట-మ॥నగర్

ఎన్. జగదీష్
3సం॥, 4.1.2001
నర్సమ్మ-యాదయ్య
షాబాద్-రంగారెడ్డి

బి. పవన్‌కుమార్
జనవరి-6
గోవిందమ్మ-కురుమయ్య
వనపర్తి-మ॥నగర్

డి. శిరిషా
9సం॥, 8.1.1995
దుర్గ-దొరబాబు
కాపవరం-ప॥గో॥

ఎన్. పూజాస్వాప్నిక
జనవరి-9
శివలీల- నాగేశ్వరరావు
గన్నవరం- కృష్ణా

ఎం.బి. పద్మశ్రీ
పారిజాతమ్మ-చిట్టిబాబు
కొత్తకోట-మ॥నగర్

వి. బాబుఫర్దీన్
ఫరీద-ఫయాజ్
ధర్మవరం-అనంతపురం

షమీర్
గోరిబి-ఖాజా
కొత్తకోట-మ॥నగర్

ఎం. సాయిగణేష్
సునిత-గోవిందరావు
పి. బి. వరం-శ్రీకాకుళం

పి. రమ్య
శారద-హేమసుందరరావు
పల్లిపేట-శ్రీకాకుళం

ఆకాశ్‌వర్మ
విజయశ్రీ-రాంజీ
తిరుపతి

రీడర్స్ మెయిల్

టు
ది ఎడిటర్, ప్రజాశక్తి,
ఆదివారం అనుబంధం

ప్రజాశక్తి ఆదివారం పాఠకులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు

కవర్ పేజీ బాగుంటోంది

ప్రజాశక్తి ఆదివారం అనుబంధం ఎంతో ఆకర్షణీయంగా వుంది. కవర్ పేజీ చాలా బాగా వుంటోంది. మాకు ఎక్కువగా పొలిటికల్ కార్టూన్స్, వ్యాసాలు కావాలి. సద్దాం గురించి, దేవానంద్ గురించి రాసిన వ్యాసాలు బాగున్నాయి.

- మార్టూరు అజయ్‌కుమార్, చిలకలూరిపేట, గుంటూరు జిల్లా.

కథలు బాగున్నాయి

సృష్టికర్త పరిష్కారము, అజ్ఞానము సృష్టించిన వింత జంతువు కథలు చాలా బాగున్నాయి. ఆధ్యాత్మిక భావమునకు, భౌతిక వాదమునకు వైరుధ్యం చూపించగల కథలను ప్రచురించవలసినదిగా కోరుతున్నాము. 21వ తేదీ ఆదివారం అనుబంధంలో వ్యాయమంలో నడక వలన, మంచినీరు తాగుట, స్థూలకాయము తగ్గుట గురించి విపులంగా ఉన్నది.

- బొట్ట రామకృష్ణ, కూకట్‌పల్లి, హైదరాబాద్

సముచితం

21వ తేదీ ఆదివారం అనుబంధం కవర్ స్టోరీ నిత్యనూతన కథా నాయకుడు దేవానంద్ గురించి, ఆయన సినీ ప్రస్థానం గురించి ఆమూలాగ్రంగా చర్చించింది. తరాలు మారుతున్నా మారుతున్న తరానికి అనుగుణంగా పరిణతి చెందిన నటనా వైదుష్యంతో దేవానంద్ రాణించటం వెనుక అతని కళారాధన తేటతెల్లమవుతోంది. నిర్మాతగా ప్రోత్సాహకుడిగా పరిశ్రమలో తనకంటూ విలక్షణ వ్యక్తిత్వాన్ని ఆపాదించుకొన్న దేవానంద్ ముమ్మాటికీ ఆదర్శప్రాయుడు దాదా సాహెబ్ ఫాల్కే అవార్డు ఆయనను వరించటం ఎంతైనా సముచితం. 'అక్షర విజేత' అడిగోపుల వెంకటరత్నం గారి సాహిత్య దృక్కోణాన్ని ఆవిష్కరించిన కళాసాహితికి అభినందనలు. కవికి సామాజిక స్పృహ ఉండాలి. కవిత్వం సమాజం కొరకే 'నడత తప్పిన నడక' వాస్తవ పరిస్థితులకు అద్దంపట్టింది.

- మంకు శ్రీను, కొవ్వూరు, ప.గో.జిల్లా

సద్దాం వ్యాసం స్ఫూర్తిదాయకం

ఆదివారం అనుబంధంలో సద్దాం అంటేనే పోరాటం వ్యాసం స్ఫూర్తిదాయకంగా ఉంది. సామ్రాజ్యవాదులకు వ్యతిరేకంగా దేశ సార్వభౌమాధికారాన్ని నిలబెట్టటం కోసం కడదాకా పోరుబాటలో పయనించిన సద్దాం హుస్సేన్ జీవిత విశేషాలు ఉత్తేజ భరితంగా ఉన్నాయి. ఇరాక్‌ను అన్ని విధాలుగా నాశనం చేసిన అమెరికా దానికి వత్తాసు పల్లికే దేశాలు మూల్యం చెల్లించాల్సి ఉంటుంది. ఇరాక్‌లో చమురు నిక్షేపాలపై కన్నుబడ్డ అమెరికా, దాన్ని చేజిక్కించుకునే పోరాటంలో దేశభక్తుడైన సద్దాం అమెరికా దళాలకు దొరికిపోవటం బాధాకరమైన విషయం. ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యంలో సద్దాంపై విచారణ జరిపించడంలో అమెరికాకు వ్యతిరేకంగా అన్ని దేశాలు సంఘటితం కావాలి.

- షేక్ ఆలీవలి, మొగల్తూరు.

మరింత సమగ్రంగా ఉంటే బాగుండేది

డిసెంబర్ 21వ తేదీ ప్రచురించిన దేవానంద్ కవర్ స్టోరీ చాలా బాగుంది. అయితే ఆయన జీవితంలోని ముఖ్య ఘట్టాలతో మరింత



సమగ్రంగా రాస్తే బాగుండేదనిపించింది. ఆయనకు 'ఇప్టా'తో మంచి సంబంధాలున్నాయి. ప్రజాశక్తి ప్రచురించినపుడు ఆ విషయాన్ని కూడా ప్రస్తావించి ఉంటే స్టోరీకి మరింత బలం చేకూరేది.

- ఎం.డి. భాషా, తిరుపతి

మనలో మాట

కొత్త సంవత్సరం వచ్చేసింది

అమ్మయ్య..... కొత్త సంవత్సరం వచ్చేసింది....

నూతన సంవత్సరం తొలిరోజు ఉదయాన్నే వాలిన ఫ్రెండ్ ఆయాసంగా కుర్చీలో కూలబడ్డాడు. తెల్లవార్లూ టీవీకి అతుక్కుపోయి నిద్రపోలేదని మూసుకుపోతున్న ఆ కళ్ళు చెబుతున్నాయి.

తొలిరోజునే అలా నిరాసక్తంగా ఉన్న ఫ్రెండ్‌ను చూసి అడిగాను.

కొత్త సంవత్సరం ఎప్పటిలాగానే వచ్చింది. ఈ సారేమైనా తేడాగా ఉంటుందేమోనని అనుకున్నాను ఫ్రెండ్ ఎంతో ఆశగా అన్నాడు.

ఎపుడూ మామూలుగా గాకుండా ఏదైనా వెరైటీగా వస్తుందా? 31వ తేదీ రాత్రి టీవీల్లో గోల.. రోడ్లపైన గోల.. అంతా గోల .. ఇపుడు వచ్చిన మార్పల్లా గోలలో మాత్రమే....

ఒకటవ తేదీ ఉదయం వరకు అంతా ఆనందమయం.... సాయంత్రం వరకు ఫర్వాలేదు.

రెండోతేదీ నాటికి యథాతథం... షరా మామూలే....

ఇదివరకు కొత్తసంవత్సరం అంటే ఆ అనుభూతి వేరు. ఇప్పటి కేరింతలు అప్పుడు లేవు. అర్ధరాత్రి 12 తర్వాత కాసేపే వీధుల్లో సంచారం ఉండేది. తెల్లారిన తర్వాతే అందరూ శుభాకాంక్షలు చెప్పుకునేవారు.

ఇపుడో తెల్లవార్లూ ఒకటే గోల.. తాగడాలు.. తందనాలాడటాలు... డిస్కోథెక్కులు... ఇవేగా ఇప్పటి నూతన సంవత్సరం వేడుకలు...

పాత సంవత్సరం అంతా రోతగా గడిచింది. కొత్త సంవత్సరం అంతా సంతోషమయంగా గడవాలని కోరుకుంటూ స్వాగతం పలుకుతాము...

కాని కొత్త సంవత్సరం రాగానే రాత్రికి రాత్రే సమస్యలన్నీ పరిష్కారమవుతాయా? సమస్యలు అలాగే ఉన్నాయి. కొత్తవి పుట్టుకువస్తున్నాయి. కాని మానవుడు ఆశావాది... బాధలతో కూడిన పాత సంవత్సరం కాలగర్భంలో కలిసిపోతుందని ఆనందం... కోటి ఆశలతో కొత్త సంవత్సరం ముంగిట్లోకి వచ్చిందని సంతోషం....

అంతా ప్రపంచీకరణ మహిమ... అందుకే కొత్త సంవత్సరానికి కూడా దాని దెబ్బ తగిలింది... ఏదో ఒక పేరు చెప్పుకోవాలి. తమ వస్తువులు అమ్ముకోవాలి. లాభాలు దండుకోవాలి.... కడుపులో బిడ్డను, కాటికి వెళ్ళిన శవాన్ని కూడా వ్యాపారం వదలదు...

మనిషి బలహీనతల ఆధారంగానే అన్ని వ్యాపారాలు జరుగుతాయి. అధికారంలో ఉన్నవారికి ప్రజల గురించి పట్టదు... ముందస్తు ఎన్నికలు కోరుకునేవారికి దేశం గురించి పట్టదు... వ్యాపారం చేసేవాడికి తన లాభమే గాని కొనేవాడి గోడు పట్టదు.. కాబట్టి కొత్త సంవత్సరం వచ్చిందని కోటి కోర్కెలు తీరుస్తుందని ఆశపడద్దు... అలాగని నిరాశ పడవద్దు...

ఎప్పటి లాగా నీ పని నువ్వు చేసుకో....

నీ బ్రతుకు నువ్వు బ్రతుకు...

కొత్త సంవత్సరం గురించి ఇక ఆలోచించవద్దు...

వచ్చిన తర్వాత ఇక పాత సంవత్సరమే

కదా...?!

ఈ సంచికలో . . .

కార్టూన్ కదంబం...	. . . 4
ఔరా!	. . . 5
కవర్ స్టోరీ	. . . 6
బాలల కథ	. . . 11
బాలనేస్తాలు	. . . 12
రియల్‌స్టోరీ	. . . 14
ఇంతిసంగతులు	. . . 16
కచేరి	. . . 17
ఆరోగ్యం	. . . 18
పుస్తక పరిచయం	. . . 20
న్యాయసలహాలు	. . . 24

ఇంకా...



కోవర్టు

కథ ... 9

గర్వించదగ్గ విషయమే!

జీవనశైలి . . . 15



చారిత్రిక నగరం ఓరుగల్లు

టూరిస్ట్ గైడ్ . . . 21



పోరాటాల పొలికేక దప్పు

కళాసాహితి . . . 22

ఇక అంతా మంచినీళ్ళప్రాయమే!

ఇంటర్‌వ్యూకు వెళ్ళాలంటే ఇంగ్లీష్!
ఇ-మెయిల్ పంపాలంటే ఇంగ్లీష్!
కంప్యూటర్ నేర్చుకోవాలంటే ఇంగ్లీష్!
కాంపిటెటివ్ ఎక్జామ్స్ వ్రాయాలంటే ఇంగ్లీష్!
విదేశాలకు వెళ్ళాలంటే ఇంగ్లీష్!
ఎక్కడ చూసినా ఇంగ్లీష్.. ఇంగ్లీష్.. ఇంగ్లీష్..

"నేనూ ఎన్నో విధాల ప్రయత్నించి చూసాను. కాని నేను మాత్రం ఇంగ్లీషులో సరిగ్గా మాట్లాడలేకపోతున్నాను. ఏదైనా తప్పుగా మాట్లాడేస్తానేమో అని భయంగా వున్నది".

ఇదేనా మీ ప్రాబ్లమ్...? NO PROBLEM !

మీచేత సరళంగా ఇంగ్లీషులో మాట్లాడించటానికి సులభమైన ఫార్ములా కనిపెట్టాం. అవును, **'స్పీచ్ జనరేటింగు ఫార్ములా' SGF™** పద్ధతిలో మేము తయారుచేసిన **స్పోకన్ ఇంగ్లీష్ ట్రైనింగ్ కోర్స్** పాఠాలను రోజూ అరగంట చదివి ప్రాక్టీసు చేస్తే చాలు.

వ్యాకరణ దోషం లేకుండా వాక్యాలను రూపొందించి వ్రాయటం నేర్చుకొని ఇంగ్లీషులో తడబడకుండా సరళంగా మాట్లాడటానికి మీవల్ల అవుతుంది. ఇప్పటికే **15** లక్షల మంది ఈ శిక్షణ ద్వారా ఫలితం పొందారు.

ఇంకా ఏంటి ఆలోచిస్తున్నారు?

వెంటనే క్రింద వున్న కూపను పూర్తిచేసి పంపండి. కోర్సు పాఠాలు **V.P.P.** ద్వారా మీ ఇంటిని వెతుక్కుంటూ వస్తాయి. పోస్ట్‌మేన్ వద్ద **రూ. 395/-** చెల్లించి పాఠాలను తీసుకోండి.

ప్రతిరోజూ అరగంట పాఠాలు చదివి ప్రాక్టీసు చెయ్యండి, ఇంగ్లీషులో గడగడమని మాట్లాడండి.

వివేకానంద ఇన్‌స్టిట్యూట్
స్పోకన్ ఇంగ్లీష్ ట్రైనింగ్ కోర్స్
ఇక ఇంగ్లీష్ మంచినీళ్ళప్రాయమే!

ఇదిగో కూపన్

Yes, నేను అరగంట సమయం కేటాయించి ఇంగ్లీషు నేర్చుకోవాలని ఆశిస్తున్నాను. నాకు కోర్సు పాఠాలను **V.P.P.** ద్వారా వెంటనే పంపండి. పోస్టుమేన్ వద్ద **రూ. 395/-** చెల్లించి తీసుకుంటాను.

పేరు: ....

చిరునామా: ....

....

.... PIN..............

పాఠాలతో పాటు 416 పేజీల ఇంగ్లీష్-తెలుగు డిక్షనరీ ఉచితంగా పొందండి.

VIVEKANANDA INSTITUTE

9 (T), Madley Road, T.Nagar, Chennai - 600 017.

PSKT

06/TEL/03/NAGA

వివేకానంద ఇన్‌స్టిట్యూట్‌యొక్క ప్రత్యక్ష శిక్షణ కేంద్రాలు: **HYDERABAD: (•S.R.NAGAR ☎23714330. •MEHDIPATNAM ☎ 55585223. •DILSUKHNAGAR ☎24044352. •KUKATPALLY ☎ 55341431. •VANASTHALI PURAM ☎24122464) •RAJAHMUNDRY ☎2422003. •KHAMMAM ☎227698. •KAKINADA☎2386638. •VIJAYAWADA ☎ 2630053. •THIRUPATI ☎2252878. •CUDDAPAH ☎224445. •KURNOOL ☎228770. •NELLORE☎2327702. •GUNTUR ☎2238541. •VISAKHAPATNAM☎2738892. •NIZAMABAD☎235767. •BHIMAVARAM☎229125. •KARIMNAGAR☎2234883. •WARANGAL☎ 2578946. •MIRYALGUDA☎230130. •ANANTAPUR.**

కార్టూన్ కదంబం

పార్టీ
సిమ్లా ఆహ్వానం
పొత్తులకు రెడీ —సోనియా

అసెంబ్లీకి ముందస్తు
దాడి
లోక్‌సభకూ ముందస్తు
మూడు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల విజయం



పిఎంకె!
ఎన్‌డిఎ స్కూలు
ఎండిఎంకె
పిఎంకె
వైదొలగిన ఎండిఎంకె
నారు



పార్టీకి పెట్టుబడులు పెడతాడంట సార్ తటస్థుల కోటాలో టికెట్ ఇవ్వమంటున్నాడు
ప్రవాసాంధ్రులు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టండి: బాబు

ఓరా!



ఏడు కోట్లకు చేరిన టెలిఫోన్లు

ప్రపంచీకరణ, ఉదారవాద ఆర్థిక విధానాలు సామాన్యుల నడ్డి విరుగ్గొడుతున్న ఈ తరుణంలో ఎలక్ట్రానిక్, టెలిఫోన్ల విప్లవం ప్రపంచాన్ని ఊపేస్తోంది. గతంలో టెలిఫోన్ అంటే ఓ విలాసవస్తువు. ఇపుడు నగరాల్లో ప్రతి ఒక్కరి చేతిలో సెల్‌ఫోన్ కనిపిస్తోంది. ఇదివరకు టెలిఫోన్ కావాలంటే ఎన్నో పైరవీలు, ఏళ్ళ తరబడి నిరీక్షణలు. మరిప్పుడో అడిగిందే తడవుగా సెల్‌ఫోన్, ల్యాండ్ ఫోన్ వాలుతున్నాయి. ఇంతటి హడావుడీ చేస్తున్నా ప్రస్తుతం మనదేశంలో ఉన్న ఫోన్ల సంఖ్య ఏడు కోట్లు మాత్రమే. రెండేళ్ళ క్రితం అయితే ఈ సంఖ్య ప్రస్తుతం ఉన్నదానికి సగమే. చైనాలో అయితే 18 కోట్ల టెలిఫోన్‌లు ఉన్నాయి.

మన దేశంలో ప్రభుత్వసంస్థ భారత్ సంచార్ నిగం లిమిటెడ్ గొంతు నొక్కి ప్రయివేటు సంస్థలకు దారాళంగా రాయితీలివ్వడంతో అవి ఒకదానితో ఒకటి విపరీతంగా పోటీపడి డిపాజిట్‌లు తగ్గిస్తున్నాయి. కాల్‌రేట్లపై కూడా రకరకాల పథకాలు ప్రకటిస్తున్నాయి. ఈ గందరగోళాల నడుమ డిసెంబర్ చివరి వారంలో దేశవ్యాప్తంగా 2.6 కోట్లుగా ఉన్న మొబైల్ ఫోన్ల సంఖ్య డిసెంబర్ 31వ తేదీ నాటికి 3 కోట్లకు చేరుతుందని అంచనా. ఎలక్ట్రానిక్ వ్యాపారం గురించి ప్రచారం జోరందుకుంటున్న ఈ రోజుల్లో సెల్‌ఫోన్ల పైనే పురోహితుడు మంత్రాలు చదివి పెళ్ళిళ్ళు జరిపే రోజులు వచ్చేస్తున్నాయని ఎలక్ట్రానిక్ పండితులంటున్నారు.

లాభమంతా కమిషన్‌దే!?

దేశరాజధాని అయిన న్యూఢిల్లీ అసెంబ్లీకి ఇటీవల జరిగిన ఎన్నికల వల్ల లాభపడింది ఎవరైనా ఉంటే కేంద్ర ఎన్నికల కమిషనేనని అందరూ ఏకగ్రీవంగా అభిప్రాయపడుతున్నారట! ఎందుకంటే ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థుల నుండి వచ్చిన డిపాజిట్ సొమ్ము కుప్పలుగా పేరుకుపోవడమే దీనికి కారణమంటున్నారు. ఎన్నికల్లో ఓడిపోయినా ఓటింగ్‌లో ధరావత్తు పొందితే డిపాజిట్ తిరిగి పొందే వీలుంది. కాని ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేసిన 817 మందిలో 674 మంది డిపాజిట్‌లు కోల్పోయారు. ఈ సొమ్మే ఎన్నికల కమిషన్ వద్ద 33.70 లక్షలు పేరుకుపోయిందట. డిపాజిట్ పెంచినా, కొన్ని ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థుల సంఖ్య భారీగా పెరగడం వల్లనే ఇలా జరిగింది. పోటీదారుల సంఖ్య పెరిగి పనెక్కువయినా ఆర్థిక లాభం కలిగినందుకు ఎన్నికల కమిషన్ సంతోషంగా ఉన్నదని భోగట్టా!?



విజి'లెన్స్'

అవినీతిపరులు, బద్ధకిస్తుల భరతం పట్టే విజిలెన్స్ శాఖ గురించి ఆసక్తి కలిగించే విషయం ఇది. అవినీతి అధికారుల పేర్లు వెబ్‌సైట్‌లో ఉంచి వారికి వణకుపుట్టిస్తున్న సెంట్రల్ విజిలెన్స్ విభాగం గురించి అందరూ వినే ఉంటారు. ఇటీవల దేశరాజధానిలోని వివిధ శాఖల్లో పనిదొంగల గురించి అంటే పని చేయకుండా దుమ్మా కొట్టే, వచ్చి పని ఎగవేసే వారి గురించి విజిలెన్స్ విభాగం రహస్య సర్వే నిర్వహించిందిట. ఇతర విభాగాలలో పనిచేసే అధికారుల వ్యవహారం ఎలా ఉన్నా స్వంత శాఖలోని సొంపు గురించి తెలుసుకుని విజిలెన్స్ విభాగం ఉన్నతాధికారులు నోరెళ్ళబెట్టారట! అందరిపై కొరడా ఝళిపించే విజిలెన్స్ విభాగంలోనే 37 శాతం మంది పని దొంగలున్నారని సర్వేలో తేలిందట?!

✻ తాతా శ్రీనివాసరావు

అమెరికా హింసాకేంద్రం గ్వాంటనామా జైలు

'కాన్సెన్‌ట్రేషన్ క్యాంప్'...

ఈ పేరు వింటేనే ఒళ్ళుజలదరించే సన్నివేశాలు మన కళ్ళముందు కదలాడుతాయి.

చరిత్రలో నాజీలు పెట్టిన చిత్రహింసలు గుర్తుకు వస్తాయి.

మానవ చరిత్రలో ఈ క్యాంపులు ఒక మాయని మచ్చ.

మానవహక్కులను కాలరాసిన ఒక నియంత సృష్టించిన మారణహోమానికి కేంద్రాలు ఈ కాన్సన్‌ట్రేషన్ క్యాంప్స్...

ఇన్ని సంవత్సరాల తరువాత మళ్ళీ ఇలాంటి క్యాంప్‌లను అమెరికా నడుపుతున్నది.

అదే 'గ్వాంటనామా' జైలు. ఇది క్యూబాలో ఉంది!

క్యూబా కమ్యూనిస్టు దేశం. అయినా అక్కడ అమెరికా జైలు ఉంది!!

నిజానికి ఇది జైలు కాదు. 'అక్రమంగా' అమెరికా తన ఆధీనంలో ఉంచుకున్న సహజ ఓడరేవు. అమెరికా నౌకా కేంద్రం.

అమెరికా 'టెర్రరిస్ట్'లుగా పట్టుకున్న **660** మందిని అత్యంత కట్టుదిట్టమైన ఏర్పాట్ల మధ్య ఖైదీలుగా ఉంచింది. రెండు సంవత్సరాల క్రితం అమెరికా ఈ నౌకా కేంద్రాన్ని జైలుగా మార్చివేసింది.

సెప్టెంబర్ 11 దాడుల తరువాత అమెరికా ప్రారంభించిన ఉగ్రవాదంపై పోరాటం వికృతరూపమే ఈ 'గ్వాంటనామా' జైలు. క్యాంప్ ఎక్స్‌రే పేరుతో దీనిని వ్యవహరిస్తున్నారు.

ప్రపంచవాణిజ్య కేంద్రంపై దాడి చేసి వేలాది మంది మృతికి కారణం అల్-ఖైదానే అని, వీరిని ఆఫ్ఘనిస్తాన్ పాలకులైన తాలిబన్లు పోషిస్తున్నారని ఆరోపిస్తూ అమెరికా ఆ దేశంపై దాడి చేసింది. తాలిబన్ల నేత ముల్లా ఒమర్, అల్-ఖైదా నేత ఒసామా బిన్‌లాడెన్ ఇంత వరకు అమెరికాకు చిక్కలేదు. కాని ఈ దాడిలో వందలాది మంది అల్-ఖైదా, తాలిబన్లను అమెరికా ఖైదీలుగా పట్టుకుంది. వీరిని ఆఫ్ఘనిస్తాన్‌లో బంధించకుండా క్యూబాలోని గ్వాంటనామాకు తరలించింది. పాకిస్తాన్‌తో పాటు బ్రిటన్, జర్మనీ, అమెరికా తదితర దేశాల నుంచి ఇదే ఆరోపణలపై అరెస్ట్ చేసిన వారిని కూడా అమెరికా ఇక్కడకు తరలించింది.



ఖైదీలను బంధించి వుంచే అతి ఇరుకైన కాంక్రీట్ చీకటి కొట్టం నమూనా

వారిని నిర్బంధించి రెండు సంవత్సరాలైనా అమెరికా ఇంత వరకు విచారణ ప్రారంభించలేదు. వారికి లాయర్లను ఏర్పాటు చేసుకునే అవకాశాన్నీ కల్పించలేదు.

చిత్ర హింసల కేంద్రం

ఇటీవల సౌదీ అరేబియాకు చెందిన కొందరిని ఇక్కడి నుండి విడుదల చేశారు. వీరి నుంచి సేకరించిన సమాచారం ప్రకారం గ్వాంటనామా జైలు 'కాన్సెన్‌ట్రేషన్' క్యాంపుగా రూపుదిద్దుకుందని వెల్లడైంది. ఖైదీలను దారుణంగా హింసించడంతో పాటు, కనీస హక్కులు కూడా లేకుండా చేస్తున్నారు. ఇదే విషయాన్ని క్యూబా పార్లమెంట్ కూడా ఒక తీర్మానంలో పేర్కొంది. అమెరికా గ్వాంటనామా కేంద్రాన్ని 'కాన్సెన్‌ట్రేషన్' క్యాంపుగా నడుపుతున్నదని విమర్శించింది. అమెరికా అక్రమంగా ఈ కేంద్రాన్ని ఆక్రమించుకుందని క్యూబా విమర్శించింది. ఖైదీలను వారి బంధువులను కాని, లాయర్లను కాని కలుసుకోనివ్వడంలేదు. సమాచారాన్ని పంపుకోవడానికి కూడా అంగీకరించడంలేదు. బందీలను చిత్రహింసలు పెట్టడం ఇక్కడ సర్వసాధారణం. మోకాళ్ళపై నడిపించడం, గోడకుర్చీలు వేయించడం. కాళ్ళకు, చేతులకు బేడీలు వేయడంతో పాటు, ముఖానికి పూర్తిగా ముసుగు వేసి ఉంచడం చేస్తున్నారు. దారుణంగా కొట్టడం,

మానసికంగా తీవ్రంగా వేధించడం వంటి ఎన్నో దారుణ హింసా విధానాలను అమలు చేస్తున్నారు. ఖైదీలకు పెట్టే ఆహారం విషయంలోనూ అమెరికా దారుణంగా వ్యవహరిస్తున్నది.

తనకు గిట్టని దేశాల్లో మానవ హక్కులు హరించబడుతున్నాయని గగ్గోలు పెట్టే అమెరికా తానే స్వయంగా వాటిని కాలరాస్తోంది. అందరికీ నీతులు చెప్పే అమెరికా తాను మాత్రం కనీస మానవ హక్కులను గౌరవించే స్థితిలోలేదు.

హక్కుల నిరాకరణ

ఆఫ్ఘనిస్తాన్‌పై యుద్ధం చేసి, అక్కడి ప్రభుత్వాన్ని కూల్చివేసి, తన తొత్తు ప్రభుత్వాన్ని ఎలాంటి ఎన్నికలు లేకుండానే ప్రతిష్ఠించిన అమెరికా ఇప్పుడు మాటమారుస్తున్నది. అమెరికాతో చేసిన యుద్ధంలో పట్టుబడిన వారిని అంతర్జాతీయ చట్టాల ప్రకారం యుద్ధ ఖైదీలుగా పరిగణించాలి. జెనీవా ఒప్పందం ప్రకారం వీరికి కొన్ని హక్కులు ఉన్నాయి. వీటిని ఐక్యరాజ్య సమితి సభ్య దేశాలన్నీ విధిగా అమలు చేయాలి. అంతర్జాతీయ చట్టాలను, సంప్రదాయాలను ఏనాడూ గౌరవించని అమెరికా వీరిని యుద్ధ ఖైదీలుకాదని, 'శత్రు దేశ పోరాట యోధుల'ని పేర్కొంది. వీరిని అమెరికా భూభాగంలో బంధించలేదు కనుక వీరికి తమ దేశ న్యాయ చట్టాల ప్రకారం న్యాయాన్ని పొందే హక్కులేదని కూడా అంటున్నది. గ్వాంటనామాలో ఉన్నవారిని విదేశాల్లో పట్టుకున్నాం కనుక వారికి ఈ చట్టాలు వర్తించవని వక్రీకరణకు పూనుకుంటున్నది. యుద్ధ ఖైదీలుగా పరిగణించడం లేదు కనుక జెనీవా కన్వెన్షన్ ప్రకారం హక్కులను కల్పించాల్సిన అవసరంలేదని సూత్రీకరిస్తున్నది. అమెరికా చట్టాల ప్రకారం వీరిని విచారించబోవడంలేదని అమెరికా అధ్యక్షుడు జార్జి బుష్ ప్రకటించారు. దేశ సివిల్ కోర్టుల ద్వారా గ్వాంటనామా బందీలు న్యాయం పొందే అవకాశం కనిపించడం లేదు. మిలటరీ కోర్టుల ద్వారా విచారణ జరిగితే పూర్తిగా రహస్యంగా ఉంచుతారు. దీని వల్ల వారికి న్యాయం జరుగుతుందన్న నమ్మకం ఎవరికీలేదు. అమెరికాకు చెందిన మానవ హక్కుల సంఘాలు కూడా వీరిపై విచారణ న్యాయంగా, నక్రమంగా జరుగుతుందన్న గ్యారంటీలేదని అంటున్నాయి. అమెరికా చట్టాల ప్రకారం గ్వాంటనామా ఖైదీలు దేశ న్యాయస్థానాల ద్వారా న్యాయం పొందవచ్చా? లేదా? అనే విషయం కోర్టు ముందుకు వస్తే సమీక్షించగలమని సుప్రీం కోర్టు చేసిన ప్రకటనను బుష్ యంత్రాంగం వ్యతిరేకించింది. అమెరికా ప్రభుత్వానికి గ్వాంటనామా జైలులో టెర్రరిస్టులను బంధించే అధికారం ఉందని దిగువ కోర్టు ఇచ్చిన తీర్పుపై సుప్రీం కోర్టు ఈ ప్రకటన చేసింది. కోర్టుకు కనీసం ఈ కేసును విచారించే అధికారమే లేదని సొలిసిటర్ జనరల్ థియోడర్ ఒల్సాన్ తెగేసి వాదించారు. అమెరికా అధ్యక్షుడి అభిప్రాయాన్నే ఆయన వెల్లడించారు. చివరకు అధ్యక్షుడు జోక్యం చేసుకుని ఆఫ్ఘనిస్తాన్, పాకిస్తాన్ తదితర దేశాల్లో పట్టుకున్న అల్-ఖైదా, తాలిబన్ టెర్రరిస్టులకు అమెరికా చట్టాల ప్రకారం న్యాయం కోరే హక్కులేదని ప్రకటించారు. క్యూబా ప్రకటన వెలువడిన రెండు రోజులకే ఈ ఖైదీల విచారణకు మిలిటరీ కమిషన్లను



గ్వాంటనామా చరిత్ర

క్యూబాలో ఈశాన్య ప్రాంతంలో ఉన్న సహజ ఓడరేవు ప్రాంతం ఇది. స్పానిష్-అమెరికన్ యుద్ధ సమయంలో అమెరికా నావికాదళం మొదటిసారిగా ఇక్కడకు వచ్చింది. ఇక్కడి నుండే అమెరికా యుద్ధం చేసింది. యుద్ధం పూర్తయిన తరువాత కూడా అమెరికా సైనికులు ఇక్కడే తిష్టవేశారు. రక్షణకు ఈ ప్రాంతం కీలకమైనది చెప్పి, 1903లో క్యూబా నుండి లీజ్‌కు తీసుకుంది. అమెరికా అధ్యక్షుడు థియోడర్ రూజ్‌వెల్ట్ ఈ లీజ్‌పై సంతకాలు చేశారు. 1939లో రెండో ప్రపంచ యుద్ధంలో పాల్గొంటున్నందున ఈ బేస్‌ను మరింత విస్తరించాలని అప్పటి అధ్యక్షుడు ఫ్రాంక్లిన్ డి. రూజ్‌వెల్ట్ ఆదేశాలు జారీ చేశారు. 1959లో క్యూబాలో జరిగిన విప్లవంలో ఫైడల్ కాస్ట్రో అధికారంలోకి వచ్చారు. క్యూబాలో ప్రభుత్వం మారినప్పటికీ గ్వాంటనామా స్థితిలో మార్పు ఉండదని అధ్యక్షుడు ఐసన్ ఓవర్ ప్రకటించారు. అలా అక్రమంగా అప్పటి నుండి క్యూబాకు చెందిన ఈ విలువైన భూభాగం అమెరికా ఆక్రమణలో ఉంది. 1961లో బే ఆఫ్ పిగ్స్ సమయంలోనూ, రష్యాకు చెందిన క్షిపణులను క్యూబాలో మోహరించారన్న వివాద సమయంలోనూ



అమెరికా క్యూబా సమీపంలోనూ, ఈ నౌకా కేంద్రంలో భారీ ఎత్తున సైనికులను మోహరించింది. క్యూబాను పూర్తిగా దిగ్బంధనం చేసి, రష్యా సైనికులను ఇక్కడి నుండి ఉపసంహరించాలని అమెరికా ఆనాడు డిమాండ్ చేసింది.

1903లో 45 చదరపు కిలోమీటర్లను లీజ్‌కు తీసుకున్న అమెరికా నౌకా కేంద్రంగానే కొనసాగిస్తూ వస్తున్నది. 34లో అమెరికాతో పాటు, దాని మిత్ర దేశాలకు ఈ రేవు నుండి ఎలాంటి



అడ్డంకులు లేకుండా సరుకు రవాణా చేయడానికి, వ్యాపార లావాదేవీలు నడిపించుకోవడానికి అనువుగా లీజ్‌ను తిరిగి రాయించుకుంది అమెరికా. ఇందు కోసం సంవత్సరానికి రెండు వేల డాలర్ల విలువైన బంగారు నాణేలను కిరాయి కింద చెల్లించే ఒప్పందం కుదిరింది. ఇది ప్రస్తుత కరెన్సీలో 4,085 డాలర్లు. ఈ లీజ్ ఒప్పందాన్ని రద్దు చేసుకోవాలంటే రెండు దేశాలు తప్పనిసరిగా ఒక అవగాహనకు రావాలి. అప్పుడే దీన్ని రద్దు చేయడం సాధ్యమవుతుంది. దీన్ని అడ్డం పెట్టుకునే అమెరికా ఇంత కాలం ఈ ప్రాంతాన్ని క్యూబాకు అప్పగించకుండా అక్రమంగా తన వద్దే అట్టిపెట్టుకుంది. అమెరికా, క్యూబా మధ్య వైరుధ్యం పెరిగిపోవడంతో ఇక్కడ ఉన్న క్యూబా ప్రజలను అమెరికా 1996 జనవరి 31 నాటికి పూర్తిగా ఖాళీ చేయించింది. క్యూబా నుండి ప్రజలను స్వేచ్ఛగా ఈ ప్రాంతం గుండా వెళ్ళేందుకు కూడా అనుమతించడంలేదు.

క్యూబా నిరసన

క్యూబా వారంరోజుల క్రితం ప్రకటించే వరకు గ్వాంటనామా జైలు గురించి అంతగా ప్రపంచానికి తెలియదు. దీన్ని చిత్రహింసల కేంద్రంగా అమెరికా మార్చివేసిందని క్యూబా పార్లమెంట్ విమర్శించింది. తమ భూభాగంలో అమెరికా లీజు పేరుతో అక్రమంగా తన ఆధీనంలో ఉంచుకున్న ఈ కేంద్రంలో కనీస మానవ హక్కులు కూడా అమలు చేయడంలేదని క్యూబా విమర్శించింది.

ఏర్పాటు చేస్తున్నట్లు అమెరికా ప్రకటించింది. ఇందుకు చీఫ్ ప్రాసిక్యూటర్‌గా కల్నల్ ఫ్రీడ్ బ్రోక్ కేసుల విచారణను త్వరలో ప్రారంభిస్తారని వెల్లడించింది. విచారణ తీరుపై అధ్యక్షుడిదే తుది నిర్ణయం. సెంటర్ ఫర్ కాన్‌స్టిట్యూషనల్ రైట్స్ సంస్థతో పాటు, అనేక పౌరహక్కుల సంఘాలు విచారణ న్యాయంగా జరుగుతుందన్న గ్యారంటీలేదని అంటున్నాయి. సైనిక కమిషన్స్‌లో విచారణ పూర్తి రహస్యంగా జరగనుంది. సాక్ష్యాల సమర్పణ, వాదోపవాదాల్లో పారదర్శకత ఉండే అవకాశం లేదు. ఈ కేసులో డిఫెన్స్ కౌన్సిల్‌గా వ్యవహరిస్తున్న కల్నల్ విల్ గున్ పెంటగాన్ నుండి రాజకీయమైన ఒత్తిడి అధికంగా వుండే అవకాశం ఉందని అనుమానం వ్యక్తం చేశారు. అయితే విచారణను బహిరంగంగా నిర్వహించేందుకు ఒత్తిడి తీసుకు వస్తామని ఆయన అంటున్నారు. ఎన్ని కేసులు, ఎలాంటి కేసులు వీరిపై పెట్టేది ఇంకా తేలలేదని కల్నల్ బ్రోక్ అంటున్నారు. గ్వాంటనామా జైలుపై ప్రపంచవ్యాపితంగా వివిధ పౌర సంఘాల నుండి వస్తున్న ఒత్తిడి వల్లే అమెరికా విచారణ చేపడుతున్నట్లు ప్రకటించింది. ఇది ప్రారంభం కావడం, వారిపై నేరారోపణ జరగడం, విచారణ తంతు అంతా చాలా సమయాన్ని తీసుకునే అవకాశం ఉంది.

బందీలను కలుసుకునే అవకాశం ఇస్తే సౌదీ అరేబియాకు చెందిన వంద మంది లాయర్లు వీరి తరపున వాదించేందుకు సిద్ధమవుతున్నారు. సౌదీకి చెందిన 124 మంది గ్వాంటనామా జైలులో ఉన్నారు. 2001, సెప్టెంబర్ 11 దాడుల తరువాత అమెరికా అరెస్ట్ చేసిన వారందరూ అరబ్‌లు, ముస్లింలే. అమెరికాలోనే వందలాది మంది యువకులను ఎలాంటి కారణం లేకుండానే నిర్బంధంలోకి తీసుకున్నారు. వివిధ దేశాల నుండి అమెరికాకు వలస వచ్చిన వారిని అధికారులు తీవ్రంగా వేధించారు. రిమాండ్‌లో వారి పట్ల అతి క్రూరంగా వ్యవహించినట్లు బాధితులు విడుదలైన తరువాత వెల్లడించారు. అమెరికా అధికారులు అరెస్ట్ చేసిన వారిలో 99 శాతం మందికి ఎలాంటి నేర చరిత్రలేదు. ఈ విషయాన్ని తరువాత సిఐఏ అంగీకరించింది. అమెరికా న్యాయశాఖ ఇటీవల విడుదల చేసిన నివేదికలో కూడా సెప్టెంబర్ 11 దాడుల తరువాత జరిగిన దాడుల్లో వేధింపులు, చట్ట ఉల్లంఘనలు, మానవ హక్కుల ఉల్లంఘనలు జరిగిన మాట వాస్తవమేనని తెలిపింది. ఇదే మాదిరిగా అల్-ఖైదా, తాలిబన్ల విషయంలోనూ జరుగుతున్నదని హక్కుల సంఘాలు అంటున్నాయి. బలవంతుడిదే రాజ్యం అన్న ఆటవిక న్యాయాన్ని అమెరికా అమలు చేస్తున్నదని బందీల బంధువులు నిరసన వ్యక్తం చేస్తున్నారు.

రెడ్‌క్రాస్ సందర్శన

బందీలను ఇక్కడ ఉంచిన కొద్ది కొన్ని నెలలకే రెడ్‌క్రాస్ సంస్థ ప్రతినిధుల బృందం గ్వాంటనామా జైలును సందర్శించింది. ఈ బృందం క్యాంప్ ఎక్స్‌రేలో బందీలను కలుసుకుంది. జైలులోని పరిస్థితుల గురించి బహిరంగంగా వెల్లడించబోమన్న షరతుతోనే ఈ బృందం ఇక్కడ పర్యటించింది. బృందం తన నివేదికను నేరుగా అమెరికా సైనికాధికారులకే సమర్పించింది. దీని వల్ల ఎలాంటి ప్రయోజనం లేదని తరువాత పరిస్థితులను బట్టి అర్థమవుతున్నది. అమెరికా ఏనాడూ అంతర్జాతీయ చట్టాలను, నియమాలను పాటించలేదు. రెడ్‌క్రాస్ ప్రతినిధులను అనుమతించడం తప్పనిసరి. దీని వల్ల అమెరికాకు వచ్చే ప్రమాదం లేదు. అటు తరువాత చాలా మంది న్యాయవాదులు బందీలను కలుసుకునేందుకు ప్రయత్నించినా, అధికారులు అందుకు అనుమతినివ్వలేదు. గ్వాంటనామా జైలులో ఉంచిన ఖైదీల విషయంలో జెనీవా కన్వెన్షన్ నియమాలను పాటించాలని ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల కమిషన్ సైతం పలు మార్లు అమెరికాకు సలహాఇచ్చింది.

ఖైదీల విషయంలో తీవ్రమైన విమర్శలు రావడంతో ఇటీవల అమెరికా కొన్ని ఫొటోలను, వివరాలను విడుదల చేసింది. ఈ ఫొటోల ప్రకారం సైతం ఖైదీల పట్ల అమెరికా వ్యవహరిస్తున్న తీరును అనేక హక్కుల సంఘాలు తప్పుపడుతున్నాయి. జైలులో ఖైదీల చెవులు, నోరు మూసివేయడం, కాళ్ళకు, చేతులకు బేడీలు వేసి ఉంచడం చేస్తున్నారు. ఇలా బంధించిన వారిని మోకాళ్ళపై కూర్చోబెట్టి సైనికులు ప్రశ్నిస్తున్న ఫొటోలు ఉన్నాయి. తమ సైనికులు వారిని మానవతా దృష్టితోనే చూస్తున్నారని, రేషన్ సక్రమంగా ఇస్తున్నారని ప్రకటించుకుంది. అన్నీ సక్రమంగానే ఉన్నాయని ప్రకటించుకుంటున్న అమెరికా ఖైదీలతో బయట ప్రపంచానికి సంబంధాలు లేకుండా కట్టుదిట్టమైన చర్యలు ఎందుకు తీసుకుంటున్నదని మానవ హక్కుల సంఘాలు వేస్తున్న ప్రశ్నకు మాత్రం సమాధానంలేదు.

అమెరికా చర్యకు నిరసనగా కాస్ట్రో చాలా కాలంగా లీజ్ కింద చెల్లిస్తున్న 4,085 డాలర్ల చెక్‌లను క్యాష్ చేసుకోవడానికి నిరాకరిస్తూ వస్తున్నారు. సెప్టెంబర్ 11 దాడుల తరువాత అమెరికాకు క్యూబా కూడా సంఘీభావం తెలిపింది. తీవ్రవాదంపై పోరాటానికి తన వంతు సహాయం చేస్తామని కూడా కాస్ట్రో ప్రకటించారు. ఇందుకు అనుగుణంగానే గ్వాంటనామాలో తాలిబన్, అల్-ఖైదా అనుమానిత టెర్రరిస్టులను ఇక్కడికి తరలిస్తున్నప్పటికీ క్యూబా అభ్యంతరం వ్యక్తం చేయలేదు. గత రెండు సంవత్సరాలుగా పరిస్థితులను గమనిస్తున్న క్యూబా ఉగ్రవాదంపై పోరాటం పేరుతో అమెరికా దుర్మార్గంగా వ్యవహరిస్తున్న విషయాన్ని క్యూబా ప్రపంచానికి ఎలుగెత్తి చాటింది. టెర్రరిస్టుల పేరుతో ఇక్కడ బంధించిన వారి పట్ల అమెరికా అమానుషంగా ప్రవర్తిస్తున్నదని అది ప్రకటించింది. ఇది కాన్సెన్‌ట్రేషన్ క్యాంప్‌గా మారిపోయిందని తెలిపింది. క్యాంప్ ఎక్స్‌రేలో పరిస్థితులు మానవతకు మాయని మచ్చగా ఉన్నాయని తెలిపింది.

ఈ విమర్శలపై అమెరికా ఇంత వరకు సరైన సమాధానం చెప్పలేదు. చెప్పేందుకు అమెరికా వద్ద సరైన సమాధానం కూడా లేదు. ఒక చిన్న దేశ పాలకులను బెదిరించి చేసుకున్న ఏక పక్ష ఒప్పందంలోని తనకు అనుకూలమైన నిబంధనలను అడ్డం పెట్టుకుని లీజ్‌ను రద్దు చేసి, క్యూబా భూభాగాన్ని ఇవ్వడానికి నిరాకరిస్తున్న అమెరికాకు ఇతరులకు నీతులు చెప్పే అధికారం ఎక్కడిది? క్యూబా ఎంతగా నిరసన వ్యక్తం చేస్తున్నా 'బలవంతుడిదే రాజ్యం' అని నమ్మే అమెరికా న్యాయంగా వ్యవహరించడంలేదు. క్యూబాలోనూ, చైనాలోనూ, ఉత్తర కొరియాలోనూ మానవ హక్కులు హరించబడుతున్నాయని పదేపదే ఆరోపించే అమెరికా తన విషయంలో మాత్రం తాను చెప్పిందే అందరూ వినాలని, తాను ఏమి చెబితే అవే హక్కులని, తాను చేసిందే న్యాయమని అహంకార ధోరణితో వ్యవహరిస్తున్నది.

గ్వాంటనామాలో ఉన్న వారందరినీ ఆఫ్ఘనిస్తాన్ యుద్ధ సమయంలోనే పట్టుకున్నందున వారికి యుద్ధఖైదీల హోదా కల్పించేందుకు ఇకనైనా ఐక్యరాజ్యసమితి జోక్యం చేసుకోవాల్సి ఉంది. మానవ హక్కుల విషయంలో అమెరికా అనుసరిస్తున్న ద్వంద్వ వైఖరిని ఎండగట్టాల్సి ఉంది. అమెరికా చర్యలు టెర్రరిజాన్ని రూపుమాపడానికి బదులు దాన్ని మరింతగా పెంచే విధంగానే ఉన్నాయి. న్యాయం కోసం కోర్టులను ఆశ్రయించే అవకాశం అందరికీ ఉందన్న సూత్రం అమెరికా అంగీకరింప చేసేందుకు అంతర్జాతీయ మానవ హక్కుల సంఘాలు, రెడ్‌క్రాస్ వంటి సంస్థలు మరింత చొరవ తీసుకోవాల్సి ఉంది. అప్పుడే దుర్మార్గుడైన బలవంతుడి నుండి బలహీనులకు రక్షణ లభిస్తుంది. నిజమైన ప్రపంచ శాంతికి ఇదే సరైన మార్గం. ఉగ్రవాదంపై పోరు పేరుతో ప్రపంచాధిపత్యానికి అమెరికా చేస్తున్న కుట్రలను ఎదుర్కోకుంటే ఈ భూతలపై టెర్రరిజాన్ని ఎన్నటికీ అంతం చేయలేం. నిజమైన ఉగ్రవాదంపై పోరు ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యంలోనే సాగాలి. ఇందుకు అమెరికాకు ఇక ఎంత మాత్రం అనుమతించ కూడదు. ●

కోవర్ట్

✻ వెంకట సుబ్బారావు కావూరి

మధ్యాహ్నం పన్నెండు దాటింది. వెచ్చటి వడమటి గాలి ఈడ్చి కొడుతోంది. బయటకు పోతే ఎండకు మొహం పగిలిపోతుందేమోనన్నట్లుగా ఉంది వాతావరణం. రోహిణీ కార్తె నిప్పులు చెరుగుతున్నది. ఆ ఊరికి ఆనుకుని ఉన్న కొండ సెగలు కక్కుతోంది. సామెత చెప్పినట్లుగా రోళ్ళు కూడా పగులుతాయేమో నన్నట్లుగా ఉంది పరిస్థితి.



నూకల్లో సంకటి వండటం పూర్తిచేసి వంటగది నుంచి బయట పడింది లచ్చుమమ్మ. మనవరాలు చంద్రమ్మ నడిమింట్లో నిద్రపోతోంది. 'చిన్నమ్మి' అని ముద్దుగా పిలుచుకునే చంద్రమ్మను చూడగానే ముసలమ్మకు జాలి కలిగింది. "ఎట్టా బతకాల్సింది. కానికాలం వచ్చి ఎట్టా అయింది పాపం" అనుకుంది మనసులోనే. తనూ, తన మనవరాలు చెర్రొండు ముద్దలు తిని మూడు రోజులయిన సంగతి గుర్తుకురావటంతో ఆమెను దుఃఖం ఆవరించింది. నీరసం కమ్మింది. ఉన్న చోటనే కూలబడింది. కాసేపటికిగానీ తెప్పరిల్లలేకపోయింది.

"అమ్మే"

కుక్కి మంచంలో ఒకటే నిద్రపోతున్న తన మనవరాలిని లేపే ప్రయత్నం చేసింది లచ్చుమమ్మ.

"ఓ సిన్నమ్మేవ్, లేవే, కూడు తిందుగోని లేవే. మళ్లీ పడుకుందువులేవే మొద్దుదానా." లేని ఓపిక తెచ్చుకుని పిలుస్తోంది ముసలమ్మ.

నిద్రపోతున్న చిన్నమ్మి మీద కోడి పిల్ల ఒకటి ఎక్కి తిరుగుతోంది. మరి నాలుగు పిల్లలు అదే మంచం మీద ఎక్కి కిచకిచ మంటూ పక్కమీద దొరికిన వాటిని ఏరుకు తింటున్నాయి. తల్లి కోడి మాత్రం ఒక పక్కన కళ్ళు సగం మూసి సేద తీరుతోంది. మధ్య మధ్యలో క్కొక్కో కొక్కో అంటూ తన పిల్లల జోలికి ఎవరన్నా వస్తే ఊరుకోనన్నట్లుగా హెచ్చరికలు జారీ చేస్తోంది.

పిల్ల లేవలేదుగదాని లచ్చుమమ్మ నేలమీదే పడకేసింది.

"లచ్చుమమ్మా ఏవి జేత్తన్నావే" అంటూ పక్కింటి అంకమ్మ వచ్చింది.

"సూడే దాన్ని కాత్త లేపమ్మా. కూడు తింటది. ఎప్పుడో మొన్ననగా రెండు ముద్దలు తింది. నీకు సెప్పలేదుగనీ అంకమ్మా, నిన్న ఎంకన్న పంపిన డబ్బిచ్చేదాకా ఇంటో ఏవీ లేదే తింటాకి. సోరకం వచ్చిద్దేమో? కాత్త దాన్ని లేపమ్మా రెండు ముద్దలు తింటది" అంకమ్మకు పని పురమాయించింది లచ్చుమమ్మ.

"ఆ, నీ మనవరాలికి ఏవీ కాదులేమ్మో, నీకేవీ కాకుండా చూసుకో ముందు."

"సిన్నమ్మే, ఓయ్ సిన్నమ్మే"......అంకమ్మ తట్టి లేపుతున్నా చిన్నమ్మి లేవలేదు.

అంకమ్మకు అనుమానం వచ్చింది. లచ్చుమమ్మా, ఏందిది లేవటం లేదు? సోరకం వచ్చిందా ఏందే? అంటూనే గబాగబా వెళ్ళి గ్లాసుతో నీళ్ళు తెచ్చింది. చిన్నమ్మి మొహాన చల్లుతూ తట్టి పిలుస్తున్నా పిల్ల కళ్ళు తెరవలేదు.

లేని ఓపికను తెచ్చుకుని లచ్చుమమ్మ ఏడుపు గొంతుతో పిల్లను ఆప్యాయంగా పిలిచింది.

అయినా మార్పులేదు. ఒళ్ళుపట్టి చూస్తే చల్లగా ఉంది. బిరుసెక్కింది. అసలు పిల్ల బతుకుందా అన్న అనుమానం ఆమెకు వణుకు పుట్టించింది.

"ఓయమ్మో నా మనవరాలికి ఏవయిందమ్మో" ముసలమ్మ ఏడుపులకు లేచింది.

"నా కొడుకొచ్చి అడిగితే నేనేమి సెప్పేదమ్మో"

"కోడలికి మొకమెట్టా సూపిచ్చేది తల్లో".

అంకమ్మ బయటకు పరుగు తీసింది. చుట్టుపక్కల వెదికి ఇద్దరు ముగ్గురు పెద్దాళ్ళను పిలుచుకు వచ్చింది.

వాళ్ళకూ అనుమానం వచ్చిందే తప్ప తేల్చి చెప్పలేక పోయారు. అంతలో అటుగా వెళ్తోన్న పక్కూరు ఆచార్లని ఎవరో కేకేసి పిలిచారు.

ఆ ఇంట్లో వైద్యం చేసినా డబ్బులు రాలవని తెలిసిన ఆచార్లు ఆగేందుకు ఇష్టం లేక ఒకింత ఆలోచిస్తుండగా "ఆచార్లో నిన్ను గదా పిలిచేది" అంటూ ఒకరు గదమటంతో ఆయనకు రాక తప్పలేదు.

చిన్నమ్మి నాడిని పట్టుకుని ఆచార్లు చూశాడు. అనుమానం లేదు. ప్రాణం పోయిందనుకున్నాడు. అయినా తొందరపడి చెప్పలేదు. గతంలో ఇట్టాగే ఒక ముసలాయనకు ప్రాణం పోయిందని తొందర పడి చెప్తే అది తిరగబడింది. ముసలాయన బంధువులు తనను దాదాపు కొట్టినంత పని చేశారు. అది గుర్తుకొచ్చి ఎందుకయినా మంచిదని స్టెత్ గుండెల మీద పెట్టి తన ఊపిరి కూడా బిగపట్టి పరీక్ష చేశాడు.

"ఊపిరి లేదు. శరీరం పూర్తిగా చల్లబడింది చూడండి. పైగా కట్టె బిగదీసుకు పోయింది. అంటే ప్రాణం పోయి గంటకు పైనే అవుతోంది" చెప్పాడు ఆచార్లు.

అక్కడున్న వాళ్ళందరికీ కళ్ళమ్మట నీళ్ళు తిరిగాయి. ఇక లచ్చుమమ్మ దుఃఖానికి అంతే లేదు. అంకమ్మ కూడా చిన్నమ్మి ఆటపాటలు ఒక్కొక్కటిగా గుర్తుకు తెచ్చుకుని కన్నీళ్ళు పెడుతోంది. ఆమెకు పిల్లలు లేరు. తీరిక దొరికితే చిన్నమ్మితోనే కాలక్షేపం చేసేది. ఇప్పుడు అందుకే వచ్చింది. ఆమె భర్త సుబ్బారెడ్డి ఒక్కడే పనులు వెదుక్కుంటూ బొంబాయి వెళ్ళాడు. బహుశా ఊళ్ళో ఇప్పుడు మిగిలిఉన్న వాళ్లలో ఆమే అందరి కంటే చిన్నది. భర్త మూడునాలుగు నెలలకు ఒకసారి పంపే ఎంఓలతో ఆమె జీవితం గడిచిపోతోంది.

చిన్నమ్మికి ఐదు నిండి ఆరో ఏడు వచ్చిందని లచ్చుమమ్మ రోజుకొకసారయినా కనపడిన వాళ్ళతో అంటుంది.

కరువుగనక లేకపోతే చిన్నమ్మిని లోటు లేకుండా చూడగలిగిన కుటుంబమే లచ్చుమమ్మది. ఆరేడేళ్ళుగా ఒకటే కరువు. పొలమంతా బీడు పడిపోయింది. పశువులకు ఆఖరుకు దుంపలు కూడా దొరకని దుస్థితి ఏర్పడింది. పదేళ్ళ క్రితం పశువుల మంద పోతుంటే లేచే ధూళి మేఘాల్లో ఎదుట ఏముందో కూడా కన్పించేది కాదు ఆ గ్రామంలో. ఇప్పుడు పశువును చూడాలంటే ఈ ప్రాంతం వదిలి తూర్పుకు రెండు వందల మైళ్ళు వెళ్ళాల్సిందే. అట్లుంది కరువు పరిస్థితి. నీళ్ళు లేక, మేత దొరక్క పశువులూ, జీవాలూ చనిపోతుంటే ఇక లాభం లేదని రైతులు వాటిని కబేళాలకు తోలేశారు. కుర్రాళ్ళెవరూ ఇప్పుడు ఊళ్ళోనే లేరు. ఆ మాటకొస్తే నాలుగేళ్లుగా అదే తంతు. ముసలోళ్ళు, పిల్లలు మాత్రమే

మిగిలారు. ముసలోళ్ళు లేని వాళ్లు ఇళ్ళకు తాళాలు పెట్టి మరీ వలస పోయారు.

లచ్చుమమ్మ భర్త శరభయ్య పదేళ్ళ క్రితమే కాలధర్మం చేశాడు. పాతికెకరాల పొలం. ఒక్కడే కొడుకు. ఏడేళ్ళ క్రితం ఆకాశమంత పందిరి వేసి కుమారుడు వెంకన్నకు దూరపు బంధువు లక్ష్మితో పెళ్ళి చేసింది లచ్చుమమ్మ. నాలుగేళ్ళ క్రితం వరకూ ఆ ఇంట్లో లక్ష్మి గలగల లాడేది. ఇప్పుడు దరిద్ర దేవత ఇనుప గజ్జెల సవ్వడి ఆ ఇంట నిత్యకృత్యమయింది.

వర్షాలు లేవు. బావులు ఏనాడో అడుగంటాయి. బోరు బావుల్లోనూ చుక్క నీరు లేదు. పోయినేడాదయితే అప్పోసొప్పో తెచ్చి నాలుగొందలు, కొందరయితే ఐదొందల అడుగుల దాకా బోర్లు తవ్వించారు. ఎక్కడా చుక్క నీరు పడలేదు.

వెంకన్న కూడా తన బత్తాయి తోటలో 19 బోర్లు వేయించాడు. దాదాపు లక్షన్నర దాకా ఖర్చయింది తప్ప ఉపయోగమే కనపడలేదు.

జియాలజిస్టులమని చెప్పుకుంటూ కనిగిరిలో బోర్డులు పెట్టుకున్న నకిలీలకు ఒక్కొక్క దానికి రెండు వందలు చెల్లించి వాళ్ళు చెప్పినచోట మొదట్లో బోర్లు వేయించాడు. వాళ్ళదంతా హంబక్ అని తేలిపోయింది.

ఆ తర్వాత నెల్లూరు నుంచి వారానికి ఒకసారి వచ్చి పాటిమీదపాలెంలో మకాం వేస్తున్న కొండలమ్మ దేవత హుండీలో అంత సొమ్ము వేసి మరీ ఆమె గుర్తు పెట్టిన చోట బోర్లు తవ్వించాడు. అదీ అంతే అయింది. తీరా ప్రభుత్వం పంపిన జియాలజిస్టు రాజారావు ఆ ఊరి మొత్తాన్నీ అణువణువూ గాలించి అక్కడ ఎంత లోతు బోరు వేసినా చుక్క నీరు పడబోదని తేల్చిచెప్పారు.

అప్పుడుగానీ ఆ ఊరి రైతులకు పూర్తిగా తెలిసిరాలేదు. అప్పటికే చేతిలో పైసలన్నీ కరిగిపోగా కనీసం ఒక్కోరైతు రెండు మూడు లక్షల దాకా బాకీల్లో కూరుకుపోయారు.

నీళ్ళు లేకపోవటంతో ఆ గ్రామంలోని రెండు వేల ఏడు వందల నలభైఎకరాల బత్తాయి, మరో నాలుగు వందల ఎకరాల నిమ్మ తోటలు పూర్తిగా ఎండిపోయాయి. పదేళ్ళ చాకిరి, ఎకరానికి లక్ష రూపాయల చొప్పున పెట్టుబడి నేలపాలయింది. జిల్లాలోని పడమర మండలాల్లో దాదాపు 24 వేల ఎకరాల్లో బత్తాయి తోటలు ఎండు కట్టెలయ్యాయి. అలా ఆ ఊరు కూడా ఎడారి అయింది. జిల్లాలోని పడమర ప్రాంతం నెమ్మదిగా ఎడారి లక్షణాలను సంతరించుకుంటోందని ఎప్పటి నుంచో శాస్త్రవేత్తలు చేస్తోన్న హెచ్చరికలు నిజమవుతున్న తీరును పత్రికలు రాశాయి పర్యావరణం దిగజారిన ఫలితంగా వర్షాలు మటుమాయమయి వందలాది గ్రామాలు కరువు బారిన పడ్డాయి. అయినా ప్రభుత్వం స్పందించిన దాఖలాలు లేవు. ఇదేమీ తెలియని గ్రామీణులు తమ ఖర్మ అలా ఉందనుకున్నారు. నగరాలకూ, పట్టణాలకూ పనులు వెదుక్కుంటూ వలసపోయారు. సాగునీటి పథకాలకు పునాది రాళ్ళు వేయటం తప్ప వాటి నిర్మాణాలను ప్రభుత్వం పట్టించుకోలేదు.

కరువు, ఆహార పథకం అంటూ ప్రభుత్వం మంజూరు చేసిన పనుల్ని అన్ని గ్రామాల్లోనూ అధికారపార్టీ సర్పంచులూ, ఇతర నాయకులూ కలిసి పంచుకున్నారు. నెల్లూరు జిల్లా నుంచి పొక్లెయిన్లనూ, ఎక్కడెక్కడి నుంచో ట్రాక్టర్లనూ తెప్పించి చెరువులూ, కుంటల్లో పూడికలు తీయించి ఆ మట్టితో రోడ్లు వేశారు. ఎందుకూ పనికిరాని, ఎవరూ, ఎప్పుడూ నడవని దారుల్లో మట్టి పోసి వాటిని రోడ్లకింద అధికారులతో రాయించుకున్నారు. రెండు పనులకూ సొమ్ము దండుకున్నారు. ఒకటి, రెండు రోజులు మాత్రం కూలీలతో పనులు చేయించారు. 10 కిలోల బియ్యం, ఇరవై రూపాయల నగదు ఇచ్చినట్లు వేలి ముద్రలు వేయించుకుని ఐదు కేజీల బియ్యం మాత్రం ఇచ్చారు. జిల్లా నుంచి వందలాది లారీల్లో పని బియ్యం చెన్నయికి తరలిపోతున్నట్లు పత్రికలు రాయని రోజే లేదు. నిన్నటిదాకా సైకిలుకు కూడా తికాణా లేని గ్రామ నాయకులు ఆహార పథకం పుణ్యమాని హీరోహోండాలపై రయ్యిరయ్యిమంటూ తిరగటం ప్రారంభించారు. ఏ పనులూ దక్కని పేదలు, రైతులు వలస మార్గం పట్టారు.

గ్రామాల్లో మూడు కాళ్ల ముసలివాళ్ళు మాత్రం మిగిలారు. తమ బిడ్డలు అప్పుడప్పుడూ పంపే ఎంఓలు అందుకుని బతకలేక బతుకుతున్నారు. ముసలోళ్లు లేని కొంపలు పాడుబడి నేలకూలుతున్నాయి.

వెంకన్న తన భార్య సహా బెంగుళూరుకు వలస పోయాడు. తనకు రోజుకు డెబ్బై రూపాయల కూలి. భార్యకు నలభై రూపాయలు ఇచ్చేవాళ్ళు. రోజుకు పదీ, ఇరవై మిగిల్చి ఊళ్ళో ఉన్న తల్లి, బిడ్డకోసం వెంకన్న పంపేవాడు. అక్కడ కొన్నాళ్ళు ఇటుకల బట్టీల్లో పని చేశాడు. తర్వాత తెలిసిన ఒకతను వెంకన్నను బొరుగుల బట్టీలో చేర్పించాడు. ఆ పని కొంత సులువుగా ఉంది. పైగా భార్యకు కూడా అక్కడే పని దొరికింది. అతని మాటగా చెప్పాలంటే సయ్యా సారం లేకుండా జీవితం గడిచిపోతున్నది.

కనిగిరి నుంచి ఫోనొచ్చిందని బట్టీ యజమాని వెంకన్నను కేకేశాడు.

“అన్నా, వెంకన్నా, నేను పేరయ్యగారి బుల్లోడ్ని మాట్లాడుతున్నా. మీ చిన్నమ్మికి బాగా లేదన్నా. నిన్నూ , వదిన్ని ఉన్న పళాన బేలెల్లి రమ్మనమని లచ్చుమమ్మ చెప్పింది. అన్నా పనుందని ఆగబాకు ఎంటనే బయదెల్లు. ఉంటానన్నా ” అంటూ ఏకధాటిగా చెప్పి ఫోను పెట్టేశాడు. అసలేమయిందని అడిగేదాకా కూడా ఆగలేదు.

వెంకన్నకు వణుకు మొదలయింది. చిన్నమ్మికి ఏమయిందో అర్థం కావటం లేదు.

గుండె నిబ్బరం చేసుకున్నాడు. ముందు బట్టీ యజమాని నంజుండప్ప దగ్గరకు పోయి విషయం చెప్పాడు.

“ఆ, చేసేదేముంది. చేరేటప్పుడు ఒకమాట, చేసేటప్పుడు ఒకరకం. రోగాలు రొష్టులు మాకు రావా? పని ఎగ్గొట్టమంటే మహా సరదా. పో, చేసేదేముంది.....” అంటూ సుదీర్ఘంగా ఉపన్యాసం ఇచ్చి మరీ వదిలాడు.

భార్యను తీసుకుని కనిగిరి మీదుగా వెళ్ళే విజయవాడ బస్సు ఎక్కాడు వెంకన్న.

ఉన్న పళాన రమ్మన్నారంటే ఏదో చిన్నా, చితకా రోగం అయి ఉండదనిపించింది వెంకన్నకు. భార్యకు మాత్రం లచ్చుమమ్మకు బాగాలేదని చెప్పాడు. దాంతో ఆమె కొంత నిబ్బరంగా ఉంది.

కనిగిరిలో దిగేటప్పటికి ఉదయం నాలుగు గంటలయింది. అక్కడ నుంచి చీమలమర్రి వరకూ ఆటోలో వెళ్ళొచ్చు. గంగంపేటకు మాత్రం నాలుగు మైళ్ళు నడిచి వెళ్ళాలి.

వెంకన్న తన ఇంటి ముందుకు వెళ్ళే సరికి లోపలి నుంచి తల్లి ఏడుపు విన్పించింది. ఏదో జరగరానిది జరిగిపోయిందనిపించింది.

లోపలికి పోయిన భార్యాభర్తలు కన్పించిన దృశ్యం చూసి నిట్టనిలువునా కూలిపోయారు.

“ఒక్కసారి కళ్ళు తెరిచి చూడు తల్లీ ” అంటూ లక్ష్మి శోక మూర్తి అయింది.

బిడ్డ చనిపోయిందన్న నిజాన్ని జీర్ణం చేసుకోవటం వెంకన్నకు సాధ్యం కావటం లేదు. ఒకటే పొగిలి పొగిలి ఏడుస్తున్నాడు. ఆకలి రక్కసి చిన్నమ్మి ప్రాణాన్ని తీసిందని లచ్చుమమ్మ చెప్పటంతో వెంకన్న తీవ్ర వైరాగ్యానికి గురయ్యాడు.

సాయంత్రానికి చిన్నారి చిన్నమ్మ కట్టెను మట్టి చేశారు.

బిడ్డపోయిన దుఃఖంలో లక్ష్మి స్పృహ లేనిదానిలా పడుకుని ఉంది. లచ్చుమమ్మ దీర్ఘాలు తీస్తూ ఏదేదో గుర్తు చేసుకుంటోంది.

వెంకన్న ఆలోచిస్తున్నాడు.

బెంగుళూరులో ఉన్న కాలంలో తనకు నేస్తాలుగా ఉన్న తెలుగు పత్రికల్లో చదివిన “ కోవర్టు” పదం వెంకన్నకు అనుకోకుండా గుర్తుకొచ్చింది.

ఆ పదం వెంకన్నకు మొదట్లో అర్థం కాలేదు. తాను ఉండే జెపీనగర్లోనే నివాసం ఉండే బాగా చదువుకున్న వెంకటేష్‌ను అడిగి తెలుసుకున్నాడు.

ఒక సంస్థలో పనిచేస్తున్న వ్యక్తులుగానీ, ముఠాగానీ ప్రత్యర్థుల లాభం కోసం అంతర్గతంగా కుట్రలు పన్నటమే కోవర్టు అంటారని వెంకటేష్ వివరించాడు.

“ పేదల కోసం పని చేస్తున్నట్లు నమ్మించి ధనికుల లాభాలకు పాటుబడే నేతలు కోవర్టులు కారా?” వెంకన్న తనలో తానే ప్రశ్నించుకున్నాడు.

పర్యావరణ రక్షణకు చర్యలు తీసుకుంటున్నట్లు ఊకదంపుడు ఉపన్యాసాలు చేస్తూ వాస్తవంలో అందుకు తూట్లు పొడిచేవారికి చేయూత ఇచ్చే ప్రభుత్వాలు నిజమయిన కోవర్టులు కాదా?

కూడు, గూడు, గుడ్డ ఇచ్చే ప్రాజెక్టుల నిర్మాణాలను పునాది రాళ్ళతో సరిపెట్టి, విదేశీ అప్పులతో నున్నటి రోడ్లు, ఫ్లైఓవర్లు అదీ నగరాల్లో కడుతున్న పాలకుల విధానాలను కోవర్టు అనకూడదా?

వర్షాలు పడకపోతే ఆయ్యో అంటూ కన్నీళ్ళు పెట్టి నటించే మంత్రులు బత్తాయి రైతులకు పరిహారం ఇమ్మంటే సరే సరే అంటూనే చేతలు చూపకపోగా, ఇజ్రాయిల్ బిందు సేద్యం పరికరాల కంపెనీలకు వందల కోట్ల రూపాయల రాయితీలు ఇవ్వటం నిజమయిన కోవర్టు ఆపరేషన్ కిందకు వస్తుందా? రాదా?

కూలీల కోసం అంటూ మంజూరు చేసిన కరువు పనుల్ని అధికారపార్టీ పెద్దలు సొంతం చేసుకోవటాన్ని ఏమనాలి?

పేదల నోటికి అందాల్సిన బియ్యాన్ని చెన్నయికి తరలించి సొమ్ము చేసుకున్న అవినీతి కాంట్రాక్టర్లను కోవర్టులుగా నిర్ధయించి శిక్ష ఎందుకు వేయరు?

తన ప్రశ్నలకు ఎవరు జవాబు చెబుతారు?

అందరి వికాసానికీ జవాబుదారీగా ఉంటున్నానని చెబుతూ వాస్తవంలో కొందరి వ్యక్తులకే అన్నీ అందిస్తున్న ఈ సమాజమే నిజమయిన కోవర్టు అనుకున్నాడు వెంకన్న.

''అవును అదే నిజం'' అని మళ్ళీ నిర్ధారించుకున్నాడు.

అప్పుడు ఒక అవగాహనకు వచ్చినవాడిలా కళ్ళు తుడుచుకుని లేచాడు.

ప్రకృతికి విరుద్ధంగా వ్యవహరించి తాను ఏవిధంగానూ కోవర్టుగా మారకూడదని గట్టిగా నిర్ణయించుకున్నాడు వెంకన్న. ●

వివేకం గెలిచింది

✻ యాసలపు సూర్యారావు

ఉజ్జయినీపుర రాజు విజయసేనుడు. ఆయన అధికారం మత్తులోపడి ప్రజల బాగోగులు పట్టించుకోవడం మానేశాడు. ఆ కారణంగా, అక్కడి నిరుపేదలు నిష్ట దారిద్ర్యంతోను, సకల రోగాలతోను బాధపడుతున్నారు. అంతుపట్టని వింత రోగాలతో చిన్నపిల్లలు, పెద్దవారు కూడా మృత్యువాతపడుతున్నారు. ఈ విషయం ఆ నోటా ఈ నోటా చివరకు రాజుగారికి తెలిసింది. ఆయన వెంటనే ఆస్థాన రాజవైద్యుణ్ణి పిలిపించి తాను విన్న విషయం గురించి అడిగాడు. దానికి వైద్యుడు "ప్రభూ! మీరు మన్నిస్తానంటే వివరించగలను" అన్నాడు వినయంగా. "నిరభ్యంతరంగా వివరించండి. వింటాం" అన్నాడు రాజు.

"మన రాజ్య ప్రజలు ఎండనకా వాననకా శ్రమించి, పంటలు పండించి మనందర్నీ కాపాడుతున్నారు. కానీ వారు మాత్రం నిత్యం వస్తులతో మాడుతున్నారు. దారిద్ర్యంతో అలమటిస్తున్న రైతులు, కూలీలు అనునిత్యం రోగాలు, రొప్పులతో మరణిస్తున్నారు. ఇలాంటి స్థితిలో మన మంత్రివర్యులు పన్నులు కట్టమని వారి ఇళ్లపై దాడులు చేయించి, చిత్రహింసలు పెడుతున్నారు. నీరు లేక, పంటలు పండక అవస్థలు పడుతున్న ప్రజలు పన్నులెలా కట్టగలరు ప్రభూ?" అని ధైర్యంగా అడిగాడు రాజవైద్యుడు.

దానికి రాజు, "మీరు చెప్పదలచింది ఇంకేమైనా వుందా?" అన్నాడు. 'లేదు ప్రభూ!' అన్నాడు వైద్యుడు. 'సరే మీరు వెళ్లండి. మళ్లీ కబురుపెడతాను' అన్నాడు రాజు.

వెంటనే మంత్రిని పిలిపించి, 'మహామంత్రీ! రాజ్యంలో ప్రజలు అకాలమరణం చెందుతున్నారు. ఈ విషయాన్ని మాకెందుకు తెలియచేయలేదు?'' అనడిగాడు. దానికాయన "ప్రభూ! చనిపోవటం వరకూ నిజమే. కాని అది మీ పాలన వైఫల్యం కారణంగా కాదు ప్రభూ.."

"మరి.."

"ప్రభూ! వారంతా దరిద్రులు. అలగాజనం. వారికి దేవుడన్నా, భక్తన్నా అసలు గిట్టవు. పాలించే ప్రభువంటే కొద్దిపాటి గౌరవభావం కూడా లేదు. తెచ్చుకున్న డబ్బులతో తాగి తందనాలాడుతున్నారు. అదంతా వారి స్వయం కృతాపరాధం ప్రభూ..' అన్నాడు. "అది సరే.. ఈ సమస్యకు పరిష్కారం లేదా?" అడిగాడు రాజు. "లేకేం? వుంది ప్రభూ! రాజ్యంలోని ప్రజలంతా యజ్ఞయాగాలు చేస్తే, వారికి పట్టిన పీడ విరగడై కష్టాల నుండి, రోగాల నుండి బయటపడగలరు" అన్నాడు. "ఇంకా మీరు చెప్పదలచుకున్నది ఏమైనా వుందా?" అన్నాడు రాజు. "లేదు ప్రభూ.." అన్నాడు మంత్రి.



అతన్ని పంపించాక రాజు ఆలోచించడం మొదలుపెట్టాడు. వైద్యుడు, మహామంత్రి చెప్పిన దాంట్లో ఏది వాస్తవమో తెలుసుకోవటం ఆయనకొక చిక్కుసమస్యగా తోచింది. వెంటనే దానికి ఒక మార్గాన్ని కనుగొన్నాడు. రాజు వెంటనే ఇరువురిని పిలిపించాడు. వారితో "మీరిద్దరు చెప్పింది విన్నాను. ఈ సమస్యకు పరిష్కారంగా మీరు చెప్పిన వాటిల్లో ఏ పద్ధతి సరైనదో ఆచరణలో మీరే నిరూపించాలి. రాజ్యాన్ని తూర్పు, పడమర భాగాలుగా విభజించి మీ ఇద్దరికీ ఇస్తాను. అక్కడి పరిస్థితులను మీరు నెలరోజుల్లో చక్కదిద్దాలి. అందుకు కావాల్సినంత ధనాన్ని ఇస్తున్నాను. ఇంకా ఏ సదుపాయాలు కావాలన్నా సమకూరుస్తాను. నిరభ్యంతరంగా మీరు కార్యరంగంలో దిగవచ్చు. నెలరోజుల్లో ఎవరైతే తమకు అప్పగించిన పనిని సమర్ధవంతంగా పూర్తిచేయలేకపోతారో వారు శిక్షార్హులు" అన్నాడు రాజు కఠినంగా. 'చిత్తం ప్రభూ! అలాగే చేస్తాం" అన్నారిద్దరూ.

"వీరిద్దరికి ఎంత ధనం కావాలన్నా ఇవ్వండి. ఏమి కావాలన్నా ఇవ్వండి. ఏదీ లేదనకండి" అని కోశాధికారిని ఆజ్ఞాపించాడు రాజు.

మహామంత్రి పడమటి భాగపు ప్రజల చేత అట్టహాసంగా యజ్ఞయాగాలు చేయించి, వారిని భక్తిపరులను చేయసాగాడు. మరో పక్క రాజవైద్యుడు తూర్పు భాగాన వున్న ప్రజలకు పుష్కలమైన ఆహారం, పానీయాలను, ఖరీదైన మందులను సరఫరా చేశాడు. పరిసరాలను పరిశుభ్రంగా వుంచేందుకు అనేక చర్యలు చేపట్టాడు. ఎవరికీ ఏదీ లేదనకుండా, ప్రజలకు అన్ని సౌకర్యాలు సమకూర్చడంలో మునిగిపోయాడు.

ఈ విధంగా రాజుగారిచ్చిన నెలరోజుల గడువు ముగిసింది. అప్పటికే వేగుల ద్వారా రెండు ప్రాంతాల సమాచారాన్ని తెలుసుకున్న రాజు వారిద్దర్నీ రాజధానికి పిలిపించారు. ఇతర పరివారాన్ని కూడా రప్పించి రాజదర్బారును ఏర్పాటుచేశారు. రాజు తన సింహాసనంపై కూర్చుని సభలోని వారినుద్దేశించి "మన రాజ్యానికి, ప్రజలకు రాగల ముప్పును వున్నది వున్నట్లుగా చెప్పి ప్రజలను మృత్యువు నుండి కాపాడిన వైద్యుణ్ణి అభినందిస్తున్నాను. తప్పుడు సలహా ఇచ్చి యజ్ఞయాగాల ద్వారా రోగాలు, దారిద్ర్యం పోతాయని చెప్పి ఇంకొంతమంది చనిపోవడానికి కారకుడైన మహామంత్రికి రాజ్య బహిష్కరణ శిక్ష విధిస్తున్నాను" అన్నాడు. పైగా రాజవైద్యుణ్ణి మహామంత్రిగా నియమిస్తున్నట్లు ప్రకటించారు. ప్రజల బాగోగులు పట్టించుకోకుండా ఇంతకాలం అలసత్వం ప్రదర్శించినందుకు వారిని క్షమాపణ కోరాడు.



అప్పూకి ఎన్నికాళ్లున్నాయి?



హాయ్! నేస్తాలూ..! పైన ఒక ఏనుగు వుందికదా. దాని పేరు అప్పు. బావుందా. మరేంటనుకున్నారు? ఈ అప్పూకి కాస్త బడాయిలెక్కువ. ఎంచక్కా అడవంతా తిరిగి చెరకుగడలు కడుపారా తింది. ఇహ కదలలేక కదలలేక ఒక్కొక్క అడుగూ వేస్తోంది. అవునూ... ఇంతకీ ఈ అప్పూగారికి ఎన్ని కాళ్లున్నాయి? చూడండి. తొందరేంలేదు. జాగ్రత్తగా చూసి చెప్పండి. హడావుడిలో దాని తొండాన్నికూడా కాలనుకునేరు. పప్పులో కాలేస్తారు. చెప్పండి చెప్పండి అప్పూకి ఎన్ని కాళ్లున్నాయి? ఐదా! ఆరా!! ఏడా!!! అప్పు ఏ జంతువుకైనా ఇన్ని కాళ్లుంటాయా? 'ఏంటండి అలా అంటారు. చూడండి మీరు కూడా లెక్కపెట్టండి. ఒకటి, రెండు ....ఐదు..ఏడు' అంటారా? ఇలా అయితే మీరు చెప్పింది తప్పే. దానికి నాలుగు కాళ్లే వున్నాయి. జాగ్రత్తగా చూడండి. అవునుకదూ. కాని చూడగానే చాలా కాళ్లు వున్నట్టు అనిపిస్తుంది. 'ఈ ఆర్టిస్టు అంకులెవరోకాని మనల్ని భలే తప్పదోవ పట్టిస్తున్నారే' అనుకుంటున్నారా? మరి అదే ఆర్టిస్టులో వున్న గొప్పతనం. సరే. వచ్చే వారం కలుసుకుందాం.

మేజిక్! మేజిక్!!

చుక్కలు కలుపుతారా!

చిన్నారి చిత్రకారులు



ఐ.తబిత, 9వ తరగతి, ది మదర్స్ హైస్కూల్, హైదరాబాదు..

జి.జి.విజయ్‌మోహన్, 7వ తరగతి, శాంతినికేతన్ పాఠశాల, పెనుబల్లి, ఖమ్మం.

వి.శ్రీలక్ష్మి, సెయింట్ మేరీస్ కేరళ పబ్లిక్‌స్కూల్, పామర్రు.



కొమ్మాలపాటి చరిత, 4వ తరగతి, సెయింట్‌పాయిస్ గరల్స్ హైస్కూల్, హైదరాబాదు.

క్విజ్-90

1. **దక్షిణ అమెరికాలోని పర్వతాలు ఏవి?**
   ఎ. ఆల్ప్స్ బి. ఆండిస్
2. **ఆంధ్రప్రదేశ్‌లో రెండవ పెద్ద నగరం ఏది?**
   ఎ. హైదరాబాదు బి. విశాఖపట్నం
3. **భూమి ఒక...?**
   ఎ. గ్రహము బి. నక్షత్రము
4. **సున్నా, నీటి గడియారం, దిక్సూచి, సిల్కు, దంతం, గొడుగులను కనిపెట్టినదెవరు?**
   ఎ. ఫ్రెంచివారు బి. చైనీయులు
5. **కపాలనాడుల సంఖ్య?**
   ఎ. 12 జతలు బి. 11జతలు
6. **శరీరంలో అతి పెద్ద గ్రంథి?**
   ఎ. కాలేయము బి. క్లోమము
7. **వేసవిలో పుష్పించేది?**
   ఎ. మల్లె బి. బంతి
8. **బొంగరపు కీలుకు ఉదాహరణ?**
   ఎ. మెడ ఎముక
   బి. చేతికీలు
9. **'పింక్ సిటీ' అని దేనిని అంటారు?**
   ఎ. జైపూర్ బి. భోపాల్
10. **ఈ ఫొటోలోని వ్యక్తి పేరేమిటి?**
   ఎ. మురసోలి మారన్
   బి. రాజ్‌కుమార్

క్విజ్ 89కి జవాబులు

1. రైల్వే స్టేషన్ 2. పులి 3. కొలంబస్ 4. ఒంటె 5. శ్రీకృష్ణదేవరాయలు 6.మూడు 7. చింతపండు 8. భారత్ 9. ఉచ్ఛ్వాసము 10. మహా శ్వేతాదేవి

క్విజ్ 88కి సరైన సమాధానాలు రాసిన వారు :

తండ రమేష్‌గౌడ్, 9వ తరగతి, చిలుకూరు, నల్లగొండ. **కె.సుభాషిణి**, 6వ తరగతి, పుల్లలచెరువు, ప్రకాశం. **పి.సుందరి**, పటమట, విజయవాడ. **టి.జయసూర్య**, 10వ తరగతి, కాశీబుగ్గ, శ్రీకాకుళం. **వి.విష్ణుప్రభాస్**, 7వ తరగతి, అరసవిల్లి, శ్రీకాకుళం. **పి.గోకుల్**, 8వ తరగతి, తిరుపతి. **ఎమ్.విజయదుర్గ**, 6 తరగతి,కాశీబుగ్గ.

కలం స్నేహం

పేరు: కె.సంధ్య,
వయసు : 14 సం॥
చదువు : 10వ తరగతి
హాబీలు : కథలు చదవడం. ఆడుకోవడం.
పూర్తి చిరునామా : కె.సంధ్య, డాటరాఫ్ కె.రామ్మోహన్, 10వ తరగతి, జడ్‌పిజిహెచ్ స్కూల్, ధర్మవరం.



పేరు: కె.అశోక్‌కుమార్,
వయసు : 14 సం॥
చదువు : 9 వ తరగతి
హాబీలు : న్యూస్ పేపరు చదవడం, చెస్ ఆడడం.
పూర్తి చిరునామా : కె.అశోక్‌కుమార్, సన్నాఫ్ కె.యాదగిరి, రాజావరం, వరంగల్.

కలం స్నేహం చేయాలని వుందా!

మరి ఆలస్యం ఎందుకు? ఒక కార్డు తీసుకుని మీ పేరు, హాబీలు, చదువుతున్న తరగతి, పూర్తి అడ్రస్ రాయండి. ఇంకా... మీ ఫొటో కూడా అతికించి పోస్టు చేయండి...అంతే. మా చిరునామా : బాలనేస్తాలు, ప్రజాశక్తి, ఫ్లేట్ నెం.1, అశోక్‌నగర్, హైదరాబాదు.

లేడి, కాకి, నక్క కథ

లఘుపతనకమనే కాకికి హిరణ్యకుడితో స్నేహం చేయాలనిపిస్తుంది. వెంటనే అతనిని పిలుస్తుంది. హిరణ్యకుడు కలుగులో వుండే 'ఎవరు నువ్వు?' అని అడుగుతాడు. 'నేను లఘుపతనకమనే కాకిని. నీతో స్నేహం చేయాలనుకుంటున్నాను' అంది. ఆ మాటలు విని 'బాగుంది. నీతో నేను స్నేహం చేయాలా? నువ్వు ఎలుకలను ఆహారంగా



పంచతంత్ర కథలు

తింటావు. నీతో స్నేహం ఆపదలకు కారణం అవుతుంది. ఇలాగే ఇదివరలో ఒక లేడి నక్కతో స్నేహం చేసి చాలా కష్టాలు కొని తెచ్చుకుంది. చివరికి ఒక కాకివల్ల ప్రాణాలను కాపాడుకోగలిగింది. కనుక నీతో స్నేహం చేసి చేతులారా కష్టాలు తెచ్చుకోలేను' అన్నాడు హిరణ్యకుడు. అప్పుడు కాకి 'నాకు ఆ కథ ఏంటో తెలుసుకోవాలని వుంది. చెప్పవూ' అంది. హిరణ్యకుడు ఇలా చెప్పాడు.

మగధదేశంలో మందారవతి వనం వుంది. అందులో ఓ లేడి, కాకి ఎంతో స్నేహంగా వుంటుంటాయి. ఒకసారి ఒక నక్క ఆ వనంలోకి వచ్చింది. ఆ వనంలో తిరుగుతున్న లేడిని చూసింది. 'ఆహా! ఈ లేడి బాగా కండపట్టి పుష్టిగా వుంది. దీనిని చూస్తుంటేనే నోరూరుతోంది. దాని మాంసం ఎంత రుచిగా వుంటుందో. ఎలాగైనా ఈ లేడిని చంపి తినాలి' అనుకుంది నక్క. అలా అనుకున్న నక్క మెల్లగా లేడి దగ్గరకు వెళ్లింది. 'అయ్యా! నాకు ఎవరూ లేరు. మిమ్మల్ని చూసి నాకు ఎంతో బలం వచ్చింది. మీతో స్నేహం చేయాలనివుంది. మీరు ఏమంటారో' అంది.

నక్క మాటలు నమ్మిన లేడి, దానిని ఇంటికి తీసుకెళ్లింది. అక్కడ మందార చెట్టుమీద కూర్చున్న కాకి, లేడి వెంట వచ్చిన నక్కను చూసింది.

'ఇతనెవరు? ఇక్కడకు ఎందుకు వచ్చాడు?' అని ప్రశ్నించింది కాకి.

'పాపం! దిక్కులేనివాడట. నాతో స్నేహం చేయాలని వచ్చాడు' అంది లేడి.

'అయ్యో నేస్తామా! మంచి చెడుల విచక్షణ లేకుండా కొత్త వారితో స్నేహం చేయవచ్చునా? ఇలాగే పూర్వం ఒక గద్ద, పిల్లి మాటలు నమ్మి, చేరదీసి ప్రాణం మీదకు తెచ్చుకుంది. ఆ కథ చెపుతా విను' అంటూ కథ చెప్పడం మొదలెట్టింది.

బుజ్జి బార్బీ

హాయ్! పక్కన కనిపిస్తోందే... దాని పేరు బార్బీ. మీలో చాలా మందికి బార్బీ బొమ్మలంటే ఇష్టం కదూ. ముఖ్యంగా అమ్మాయిలకు బార్బీ అంటే చాలా ఇష్టం. ఇప్పుడు బార్బీ వెబ్ సైట్ కూడా పెట్టారు. ఆ వెబ్ సైట్ అడ్రస్ ఏంటంటే..... www. Barbie com. ఈ వెబ్ సైట్‌లో ఆటలూ, పాటలూ అన్ని వుంటాయి. ఇది చూడాలంటే మీ ఇంట్లో ఇంటర్నెట్ వుండాలి. దీనికంటే ముందు మీ ఇంట్లో కంప్యూటర్ వుండాలి. సరేనా ఇవన్నీ వున్న చిన్నారులు ఎంచక్కా బార్బీ సైట్ చూడొచ్చు.

ఈ మృత్యు విషాదానికి కర్తలెవరు?

జనన మరణాలు ఎంత సహజమో వాటితో ముడివడిన ఆనంద విషాదాలు అంతే సహజం. మరణం కలిగించే విషాదంలోనే తరతమ తేడాలుంటాయి.పోయిన వారి వయసు, కారణం, కుటుంబ నేపథ్యం తదితర అనేక అంశాలు దు:ఖం మోతాదును ప్రభావితం చేస్తుంటాయి. బాగా పెద్ద వారు పోయినపుడు కాలధర్మం అనుకుంటాం. ఏదైనా జబ్బుతో నరక యాతన అనుభవించిన ఆప్తులు పోతే సుఖపడిపోయారని లోపలైనా అనుకుంటాం. మంచి భవిష్యత్తున్న వారు అకాలంగా పోతే విపరీతంగా బాధ పడతాం. ఆ పోవడం ప్రమాదంలోనైతే ఇంకా విచారిస్తాం. అలాటప్పుడు ఉజ్వలభవిష్యత్తున్న ఓ యువకుణ్ణి ఒక యువకుడిని ఏ దుండగులో, దుర్మార్గులో నిష్కారణంగా బలిగొంటే కలిగే విచారం మరెంత ప్రగాఢంగా వుంటుంది? అది కూడా ఎక్కడో దేశం కాని దేశంలో సంభవించినపుడు నిజమైన ఒక విషాదం అక్షరాలకు అందని స్థాయిలో మనలను కమ్ముకోదూ!

అమెరికాలో ఇటీవల దారుణహత్యకు గురైన ఇంజనీర్ ధీరజ్ అంత్యక్రియల దగ్గర అలాటి విషాదమే తాండవించింది. ఆ కుర్రవాడి మృతికి చలించని మనసు లేదు. తన తాత ఎబికె ప్రసాద్ ప్రముఖ పత్రికా సంపాదకుడు కావడం వల్లనే కాదు- అంతకు మించిన అనేక సామాజిక అంశాలు ఆ అబ్బాయి మృత్యువులో కనిపిస్తున్నాయి.

మనలో అత్యధికులం అమెరికాను గమ్యంగా భావిస్తున్నాం. వాస్తవ పరిస్థితుల రీత్యా చూస్తే దానికదే తప్పు కాదు కూడా. ప్రతిభాసంపత్తులను పెంచి, సమున్నత ప్రమాణాలతో జీవితం అందించే సీమగా అక్కడకు చేరుకోవాలని ప్రయత్నించడం అర్థం చేసుకోదగిన విషయమే. రెండు మూడు తరాల కిందటే అక్కడికి తరలి పోయిన కుటుంబాలను గాని, దశాబ్దాల అనంతరం దేశానికి నోబుల్ బహుమతి సంపాదించిపెట్టిన చంద్రశేఖర్‌ను గాని మనం విమర్శించం. విద్య వ్యాపారమయమైన ఈనాడు ఇండియాలో పెట్టే డబ్బులోసగం పెట్టి అమెరికాలో అంతకంటే మెరుగైన విద్యార్జన చేయగల అవకాశమున్నపుడు సంపన్న వర్గాలను అటుకేసి చూడవద్దని శాసించాలనుకోవడం కూడా వాస్తవికత కాదు. ఇక ఇలాటి అవసరాలేమీ లేకుండా కేవలం తమ ప్రతిభతో అలవోకగా అవకాశాలు సంపాదించి చదువుకోసం, వృత్తికోసం అమెరికా చేరిన వారిలో కూడా దోషమేమీలేదు. ధీరజ్ తన ప్రతిభ ద్వారానే అమెరికా వెళ్లిన యువకుడు. బంధు మిత్రులందరూ ఏకకంఠంతో చెప్పిన దాన్ని బట్టి అతను మంచి స్నేహశీలి. నాయకత్వ లక్షణాలున్నవాడు. అమెరికాలో స్నేహితులు నలభై మందికి ఉద్యోగాలిప్పించేందుకు కృషి చేసిన సహృదయుడు. అంతేనా? ఇండియాలో ఇద్దరు పిల్లలను దత్తత తీసుకుని చదివిస్తున్న మానవతావాది. అన్నట్లు ఆటల్లో బహుమానాలు సంపాదించిన క్రీడాకారుడు.

సాధారణంగా చాలా మంది నేటి యువత పాడై పోయిందని, వెనకటి తరం విలువలు ఇప్పుడు లేవని వ్యాఖ్యానిస్తుంటారు, వాపోతుంటారు. అమెరికాలో వుండి కూడా దేశాన్ని, సాటి మనుషులను మరచిపోని ధీరజ్ వంటి వారిని చూశాకనైనా ఇలాటి అభిప్రాయాలు ఎంత పాక్షికమో తెలుసుకోవలసి వుంటుంది. నేటి సమాజంలో దుర్లక్షణాలకు కారకులుగా, పోషకులుగా యువతను నిందించడం సమంజసం కాదు. వాస్తవానికి తమకన్నా ముందున్నవారిని చూసి కొత్త తరం విలువలు ఏర్పరచుకుంటుంది. యువతలో విలువలు క్షీణించాయనుకుంటే అందుకు బాధ్యత ముందు పెద్దలే వహించవలసి వుంటుంది. ఆ విషయం పక్కనబెడితే ధీరజ్ వంటి యువకులను చూసినపుడు, వాళ్లగురించి విన్నప్పుడు మనకు యువతలో మంచి విలువలు, మానవతా దృష్టి ఎంత బలంగా వుంటాయో కళ్లకు కట్టినట్టవుతుంది. అందుకే ధీరజ్‌కు నివాళులు అర్పించడానికి వచ్చిన పెద్దలందరూ అతని గుణగణాలను వర్ణిస్తుంటే మనసు ఆర్ద్రమై పోయింది. ఇదో పార్శ్వం.

ఇక రెండవ పార్శ్వంలోకి వస్తే- ఒక ఉజ్వల భవితవ్యం మొగ్గలోనే అంతరించడానికి వెనకనున్న సామాజిక విషాదం మృత్యువిషాదం కన్నా తక్కువదేమీ కాదు. చదువుకుంటూనే పని చేసే అమెరికా పద్ధతికి అనుగుణంగా ధీరజ్ ఒక పెట్రోలుబంకులో పని చేస్తున్నాడు. అంతకు ముందు ఒక క్యాంటిన్‌లో చేశాడు. భారతీయ స్నేహితులకు చాలా మందికి అలా ఉద్యోగావకాశాలు కల్పించాడు. అందరి అభిమానం పొందాడు. అలాటి ఒక చలాకీ కుర్రాడు తన బాధ్యత, తప్పు ఏమీ లేకుండానే ఒకానొక అభద్ర సామాజిక వ్యవస్థకు బలైన పరిస్థితి. ఇప్పటికి హైదరాబాదుకు చెందిన నలుగురు ఇలా ప్రాణాలు కోల్పోయారట. తుపాకి లైసెన్సులు విచ్చలవిడిగా లభించే దేశంలో ఇలా జరగడం సర్వసాధారణం. ధీరజ్ ఆంధ్రుడు కావడం వల్లనే ఈ వార్త మనవరకూ వచ్చింది. ఇక్కడ ప్రశ్న ఒక్కటే. ఈ సామాజిక అవ్యవస్థకు, అరాచకానికి, అభద్రతకు బాధ్యత ఎవరిది? ఈ విషాదం వెనక గల సామాజిక సందేశమేమిటి?

ప్రమాదాలను, అశాంతిని పూర్తిగా ఆపడం ఎవరి వల్లా కాకపోవచ్చు. కాని ప్రపంచమంతటిపైనా పెత్తనం స్థాపించుకోవడమే విధానంగా పెట్టుకున్న దేశంపైనా దాని ప్రభావం పడకుండా వుండటం సాధ్యమా? సంపదలు, సదుపాయాలు మాత్రమే మనుషులకు సుఖశాంతులు ప్రసాదించలేవు. నిజానికి సుఖం శాంతి అనే మాటలను జంటపదాలుగా వాడటంలోనే పెద్ద అర్థముంది. మెరుగైన అవకాశాలకోసం, అభ్యున్నతి కోసం తన దేశం వచ్చి అమూల్యమైన సేవలందిస్తున్న పరదేశీయులకు అమెరికా గాని, ఐరోపా దేశాలు గాని చాలాసార్లు భద్రత కల్పించలేకపోవడం వాస్తవం. పైగా అక్కడ పరిస్థితులు ఉద్రిక్తమైనప్పుడంతా వీళ్లపైన ఆంక్షలు పెంచడం చూస్తుంటాం. అమెరికా అధ్యక్షులకే అనేక సార్లు రక్షణ లేకుండా పోయింది. రోనాల్డ్ రీగన్ కూడా తృటిలో బయటపడ్డాడు. సెప్టెంబరు11 ఘటనలో వేలాది మంది మరణించారు. ఇందుకు బాధ్యత బిన్‌లాడెన్‌దని నిందించవచ్చు, వేటాడవచ్చు. కాని లాడెన్‌ను, ఇప్పుడు అనాగరిక పద్ధతిలో బంధించిన సద్దాంను కూడా మొదట పెంచిందెవరు? అమెరికా అధినేతలే కదా. వాళ్లు చెప్పినట్టు వినకపోయినందుకే తప్ప కోపం వారి చర్యలకు కాదు. ఎవరు ఎలాటి వారైనా తాము చెప్పినట్టు చేస్తే హాయిగా భరిస్తారు డాలర్ ప్రభువులు. ఇదిగో ఇలాటి నేపథ్యంలోనే పుట్టారు ధీరజ్ వంటివారిని బలిగొన్న హంతకులు.

ఆర్థికంగా తీవ్ర అసమానతలు వున్నంత కాలం అసాంఘిక శక్తుల పుట్టుకకు, పెరుగుదలకు అవకాశముంటూనే వుంటుంది. వాటిని ఉపయోగించుకునేది కూడా ఉన్నత వర్గాలేనన్నది ఇక్కడ ప్రత్యేకంగా గమనించాల్సిన విషయం. అరాచక శక్తులను పెంచిన తర్వాత ఏదో ఒక దశలో అడ్డం తిరగడం అనివార్యం. దాన్ని అదుపు చేయడమూ పెద్ద సమస్యే. వీధి గూండాల నుంచి విశ్వానికే విపత్తు తెచ్చే అణుచోరుల వరకూ ఈ కుదురు నుంచి వచ్చిన వారే. అందుకు మూలకారణాలను, మహారాజ పోషకులను వదిలిపెట్టి టెర్రరిజంపై సమరం అని గొడవ చేయడం ఎవరిని కాపాడుతుంది?

ధీరజ్ దారుణహత్య ఇలాటి అనేక ప్రశ్నలను మనలో లేవనెత్తుతుంది. ఒక కుదుపు, ఒక దిగ్భ్రాంతి ఎదురైనప్పుడైనా ఇలాటి విషయాలు ఆలోచించకపోతే మన చైతన్యానికి అర్థం వుండదు.

మళ్లీ చివరలో చెప్పకతప్పదు. జనన మరణాలు ఎంత సహజమో వాటితో ముడివడిన ఆనంద విషాదాలు అంతే సహజం. కాని విషాదం తాత్కాలికం కావాలి. అదెంత ప్రగాఢమైందైనా సరే. జీవితం సాగిపోవాల్సిందే. మృత్యు విషాద క్షేత్రంలో మళ్లీ జీవకణం పుట్టాలి. పోయినోళ్లలో మంచోళ్ల మంచిని ముందుకు తీసుకుపోవాలి. ధీరజ్ వంటి ధీమంతుని ప్రాణబలి సార్థకం కావాలంటే అలాటి దీక్ష మనలో మొలకెత్తాలి. ●

✻ ముదిగంటి సుజాతారెడ్డి

గర్వించదగ్గ విషయమే!

ఆడపిల్లలు గర్భంలో వుండగానే హత్యలకు గురవుతున్నారు. వరకట్నం చావులు నిత్యం జరిగే మారణహోమాలు అని ప్రపంచమంతా మన దేశం అప్రతిష్టకు గురవుతున్న తరుణంలో ఏకంగా ముగ్గురు స్త్రీలు తమ పార్టీలకు పూర్తి మెజారిటీతో కూడిన గెలుపును తెచ్చి పెట్టి ముఖ్యమంత్రులుగా ఎన్నికకావటం చాలా గర్వించదగ్గ విషయం! అని నేనుకుంటూ ప్రసన్నంగా వున్న సమయంలోనే లలిత ప్రవేశించింది. "హమ్మయ్య! ఈసారి ఏ గొడవలు లేకుండా ఎలక్షన్లు జరిగిపోయాయి. దానికి సంతోషించాలి!" అంది లలిత.

'గొడవలంటె కొట్లాటలు, ఫైరింగ్, చావటం, బాక్స్‌లను, ఓటింగు మెషీన్లను ఎత్తుకుపోవటం, దొంగ ఓట్ల గందరగోళం వగైరా వగైరా లేకుండా ఎన్నికలు జరిగిపోయాయనా నువ్వు అనేది..." అన్నాన్నేను.

"సరే! బోలెడు మంది పోలీసుల సమక్షంలో అవీ కొన్ని జరిగాయనుకో..." అని సాగదీసింది లలిత.

"లల్లీ! ఒకటి గమనించావా? - యాభై యాభై ఆరు శాతం మంది ఓట్లు వేస్తేనే మనం భారీ ఓటింగు జరిగిందని గొప్పగా చెప్పుకుంటున్నాం. అంటే దాదాపు సగం మంది జనాభా తమ ఓటు హక్కును వినియోగించుకోవడమే లేదు. ప్రజాస్వామ్యంలో ఓటుకున్న విలువ ఏమిటో ప్రజలు గుర్తించటమే లేదన్నమాట. ఈ విషయంలో ప్రజల్ని చైతన్యపరచాలా? వద్దా?" అన్నాన్నేను.

"సరే! నీకు తెలుసో లేదో! చదువుకున్న వాళ్ళు సమాజంలో చైతన్యవంతులైన వాళ్ళే ఎక్కువ సంఖ్యలో ఈ ఓటు హక్కును వినియోగించుకోవటం లేదట! మా పక్కింట్లో భార్యాభర్తలిద్దరూ లెక్చరర్లు. వాళ్ళు ఎప్పుడూ ఓటు వేయరట! అట్లా అని గర్వంగా కూడా చెప్పుకుంటారు. మేం ఓటు వెయ్యకపోతే ఏమిటండి! మా ఓటును ఎవరో వేస్తూనే వున్నారు! అని నవ్వుతాడు ఆ భర్త. అదేమి "నాగరికతో నాకర్థం కాదు!" అంది లలిత ఆశ్చర్యం, కోపం కలిపేస్తూ.

"నువ్వన్నది నిజమే లల్లీ! చాలా మంది చదువుకున్న వాళ్ళే ఓటు వెయ్యరు. పోవటానికి సోమరితనం! పైగా ఆ రోజు ఏ పిక్నిక్కో వంటి ప్రోగ్రాంలు పెట్టుకుంటారు. లేదా సెలవు రోజుగా భావించి వేరే ఊర్లకు ప్రయాణం కడ్తారు. తెలియని వాళ్ళకు చెప్పటం సులభం, కాని తెలిసిన వాళ్ళకేం చెప్తాం! ఏం చైతన్యపరుస్తాం!-"

"అవును గద! ఇసుకలోంచి నూనెను తీయవచ్చుగాని మూర్ఖునికి మాత్రం చెప్పలేం - అని ఎవరో కవి కవిత్వంలోనే సత్యాన్ని చెప్పాడు! ఇంతకూ నేను ఎన్నికల గురించి చెప్పేది ఈసారి అన్ని రాష్ట్రాల్లో ఏదో ఒక పార్టీ మెజారిటీ రావటం. ఏ పార్టీకి మెజారిటీ రాకపోతే తెల్లారి నుంచే... తెల్లవారి ఎందుకు ఎన్నికల ఫలితాలు రాకముందు నుంచే పోట్లాటలు! బేరాలు! పార్టీ ఫిరాయింపులు! నానాగందరగోళం మొదలయ్యేది. అట్లా కాక ఈసారి నాలుగు రాష్ట్రాల్లోనూ ఏదో ఒక పార్టీ ఎక్కువ మెజారిటీ రావటంతో ఏ గొడవలు లేవు అన్నాన్నేను. అంతేగాని ఓటింగు ఏదో అతి ప్రశాంతంగా జరిగిందని కాదు" అంది లలిత "ఓహో! అదా! నీ సంతోషానికి కారణం! నేనేమో ఈ ఎన్నికల్లో ముగ్గురు స్త్రీలు ముఖ్యమంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారని సంతోషపడుతున్నాను" అన్నాన్నేను చిరునవ్వుతో.

"ఆఁ... ఇంతకుముందే ఇద్దరు ముఖ్యమంత్రులుగా స్త్రీలున్నారు. మాయవుంటే ముగ్గురై వుండేవాళ్ళు. కాని వాళ్ళు ఏమైనా పనులు చేస్తున్నారంటారా?.. ఐమీన్... ప్రజల కోసం ఏమైనా పనులు చేస్తున్నారంటారా?.. అనుమానం వ్యక్తం చేసింది లలిత. మళ్ళీ వెంటనే అందుకుంది-

"వాళ్ళు ఏం చేస్తున్నారో తెలియదు! ఇప్పుడు మరో ముగ్గురు స్త్రీలు ముఖ్యమంత్రులయ్యారు! ఏం చేయబోతారో తెలియదు!" అంది లలిత.

"మగవాళ్ళు ఏం చేయకపోయినా ఎవరూ ఏమీ అడగరు. కాని ఆడవాళ్ళు చేయకపోతే - ఆడవాళ్ళు ముఖ్యమంత్రులై ఏం చేస్తున్నారు? - అంటారు. ఆ విధంగా ఆడవాళ్ళకు ఏ పనిలో అయినా, ఉద్యోగంలో అయినా తన సత్తా నిరూపించుకోలసి ఉంటుంది. అంటే ఆడవాళ్ళకు ఎప్పుడూ అగ్ని పరీక్ష తప్పడం లేదు!" నవ్వుతూ అన్నాన్నేను.

"నిజమేనే సుశ్మీ! స్త్రీలు ఏ పని చేసినా బాధ్యతాయుతంగా చేస్తారు! అయినా తప్పు పట్టే వాళ్ళే ఎక్కువ. ఉద్యోగ ధర్మాన్ని సక్రమంగా చేస్తుందా లేదా? - అని వెయ్యి కళ్ళతో కనిపెట్టుకునే ఇంద్రులు వుండనే వుంటారు" లలిత చిరునవ్వుతో అంది.

"అంటే ఆడవాళ్ళు తమ సత్తాను నిరూపించుకోవలసి వుంటుంది. ఏ పనిలోనైనా అట్లా స్త్రీల మీద డబుల్ ఒత్తిడి ఉంటుంది. కాని లల్లీ! నువ్వన్నట్లుగా ఒకటి మాత్రం నిజం! పార్టీని పూర్తి మెజారిటీతో గెలిపించి ఈ ముగ్గురు స్త్రీలు ముఖ్యమంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. ఏది ఏమైనా ముప్పై మూడు శాతం కేటాయింపులు ఎన్నికల సీట్లలో కావాలంటున్న ఈ సమయంలో మన దేశంలో ఐదు రాష్ట్రాలకు స్త్రీలు ముఖ్యమంత్రులుగా వుండడం ఆడవాళ్ళం మనం గర్వించవలసిన విషయం!' అన్నాన్నేను నా గొంతులో గర్వాన్ని ధ్వనింపజేస్తూ.

"నువ్వన్నది నిజమేనే సుశ్మీ!" అంది నా మాటను ఒప్పుకుంటూ లలిత. ●

జనవరి ఒకటి...

పాత నిన్న బరువుగా గడిచింది!

కొత్త రేవు ఆశలను మోసుకొస్తోంది!

కవిత్వం రాస్తున్నానని ఖంగారు పడకండి. హైస్కూల్లో చదువుకునే రోజుల్లో మా శమంతకమణి రాసిన కవిత్వంలో రెండు ముక్కల్ని గత పదిహేనేళ్ళుగా మోసుకువస్తున్నాను!

ఇప్పుడెక్కడుందో శమంతకమణి!

పాత ఏమిటో మనకి బాగా తెలుసు! పాతని అనుభవించి కొత్తలోకి అడుగు పెడుతున్నాం గదా! ఈ కొత్త వరస ఎట్లా అఘోరిస్తుందో తెలీక అల్లాడిపోతుంటాం! అంచేత ఈ కొత్తమీద మనిషికి బోలెడు ఆశలుంటాయి!

ఆశతో బతకడం మనిషి లక్షణం!

ఆ మాటకొస్తే ఆశ అనే టానిక్కు లేకపోతే మనిషి బతకలేడు. బతికినన్నాళ్ళూ ఏదో ఆశ అతన్ని బతికిస్తూనే వుంటుంది!

వేదాంతంలో పడ్డట్టున్నాను!

విడిచిపెట్టండి!

కొత్త సంవత్సరం మనల్ని ముట్టుకుని మూడు రోజులు గడిచేయి! ఈ మూడు రోజులల్లే - అదే బాణీలో గడిచేయే గాని ఏ కొత్త దనాన్నీ అనుగ్రహించలేదు! మూడు రోజులకే విచిత్రాలూ విడ్డూరాలూ ఎదురవుతాయని ఆశించడం కూడా తప్పేనేమో!

ఖచ్చితంగా -

కొత్త సంవత్సరంలో నా దశ తిరుగుతుందని ఎందరు ఎన్ని సంవత్సరాలుగా ఆశ పెట్టుకుని వుండలేదూ?

ఉషోదయం అని మా శమంతకమణి ప్రతి కొత్త సంవత్సరానికి కవిత్వం రాస్తూ వుండచ్చు. కాకపోతే సదరు కవిత్వం ప్రతి కొత్త సంవత్సరానికీ అదే బాణీలో వుంటుంది! మార్పేమీ వుండదు!

అంచేత -

పదేళ్ళ క్రితం శమంతకమణి రాసిన కొత్త సంవత్సరమనే కవిత్వం - అందులో వున్న కొత్త కొత్త ఆశలూ - మరో పదేళ్ళ వరకు మార్చుకోనక్కర్లేదు! అక్షరం మార్పు చేయకుండా ప్రతి సంవత్సరం అదే కవిత్వం చదివేసి సరిపెట్టుకోవచ్చు!

అందుకే -

పదిహేనేళ్ళ క్రితం కొత్త సంవత్సరమ్మీద మా శమంతకమణి రాసిన కవిత్వాన్ని మళ్ళీ ఇప్పుడు - కొత్త సంవత్సరం సందర్భంగా మీ ముందు వుంచేను! వదిలేయండి!

ఈ కొత్త సంవత్సరం తొలి రోజు మీ అందరికీ ఎట్లా గడిచిందోగాని - మా ఇంటో మాత్రం పాత సంవత్సరం రోజుల్లాగానే అతి మామూలుగా గడిచింది!

శ్రీవారు కేలెండర్ల కోసం, డైరీల కోసం అడ్డమైన చోటా తిరుగుతూనే వున్నారు. డైరీల మాటేమోగాని - ఆయనకి కేలెండర్లంటే మా గొప్ప మోజు!

ఆముదంతో అవసరం లేకపోయినా - కేవలం కేలెండర్ల కోసం రెండు ఆముదం సీసాలు కొనుక్కొచ్చేరు!

దిక్కుమాలిన ఆముదం ఇప్పుడెందుకని అరిచేను. చిద్విలాసంగా నవ్వేసేరు! అంతేగాని కేలెండర్ల కోసమని నిజం చెప్పలేదు!

మీరు మా ఇంటికి రాలేదు!

వచ్చి వుంటే తెలిసేది-

మా ఇంటికి గోడలు కనిపించవు. ఇల్లంతా కేలండర్లే! ప్రకృతి సౌందర్యం వెదజల్లే కేలెండర్లతో పాటు ప్రముఖ సినీతారల కేలెండర్లు మా ఇంటి గోడల్ని కప్పేసేయి!

అందులో-

ఫలానా బ్రాండు విస్కీనే తాగండి అంటూ ఒక సుప్రసిద్ధ సినీతార కేలెండరు చెడ్డరోతగా కనిపిస్తుంది. ఆ కేలెండర్ని చూడగానే శ్రీవారిని అడిగేను - ఆవిడ నిజంగా ఆ విస్కీనే తాగుతుందా అని!

ఆవిడ ఆవుమజ్జిగ తప్ప మరోటి తాగదని రోషంగా అన్నారు. అలాంటప్పుడు ఆవిడగారి బొమ్మ ఆ దిక్కుమాలిన విస్కీ కేలెండర్లో ఎందుకుండాలీ అని ప్రశ్నించేను. అదివ్యాపారమన్నారు! తన చేతిలో వున్న మరో కేలెండరు నా కళ్లముందు పెట్టేరు. అందులో మరోతార ఫలానా బ్రాండు బీడీలనే కాల్చండనే ప్రకటన వుంది!

ఆ కేలెండరు ఫిలాసఫీ నేను చెప్పేను-

"ఈ తార బీడీలు కాల్చదు. సిగరెట్ల సంగత్తెలీదు. కానీ బీడీ ప్రియురాలిగా కనిపించడం వ్యాపారం!"

నా విమర్శని సీరియస్‌గానే తీసుకున్నట్టున్నారు!

ఆ కేలెండర్ని కోపంతో నేలకేసి కొట్టేరు!

మనోహరమైన కేలెండర్లు ఇంటినిండా కంటికింపుగా వుండగా - ఈ విస్కీలూ బీడీల కేలెండర్లెందుకు చెప్పండి?

జనవరి ఫస్టు అనే పండగ మీద మా వారికి అపారమైన ప్రేమ. నెలరోజులు ముందుగానే హడావిడి పడిపోతుంటారు! మిగతా పండగలన్నీ చెత్త!

పండగపూట మనం తలంటుకుంటే తిడతారు!

కొత్తబట్టలు కట్టుకుంటే నవ్వుతారు!

దీపావళి డబ్బు తగలేసుకుందుకి వస్తుందంటారు. అప్పు చేసి అల్లుళ్ళని మేపేందుకు సంక్రాంతి వెలుస్తుందంటారు. దసరా అర్ధం లేని డాబుసరి పండగంటారు!

ఈ విధంగా ప్రతి పండగనీ దుయ్యబట్టే శ్రీవారు ఒక్క జనవరి ఒకటిని మాత్రం కళ్ళకద్దుకుంటారు! జనవరి ఒకటికి మించిన ఘనమైన పండగ భూలోకంలో లేనే లేదంటారు! దీన్నెవడు కనిపెట్టాడో గాని వాడి కాళ్ళు కళ్ళకద్దుకోవాలంటారు!

ఏం చెబుతాం?

ఎవరి పిచ్చి వాళ్ళకి ఆనందం!

సుపరిపాలన - యాంటి ఇంకుంబెన్సీ

"ఒరె బామ్మర్దీ... అన్నీ సజావుగానే అనిపించినా మనిషికి ఒకోసారి 'భయం' ఎందుకవుతుందంటావ్?" పచ్చబాబు ఆ ప్రశ్న అడిగే సరికి సోమయ్య తెల్లబోయి బుర్ర గోక్కున్నాడు. నిస్సహాయంగా చూశాడు. "ఏందో బావా! ఈ ఎలక్షను సీజన్లో నీ మాటలు అసలర్థమై చావవు. ఒక వివరం వుండదు. ఎట్ల అర్థం చేసుకోవాల్నో తెలవదు!"

"అరె.. అది గాదురా.. మీ అక్కకూ నాకూ ఈ సీజన్లో అస్సలు పడి చావడం లేదు" ఈ మాట పూర్తికాంగానే సోమయ్యగాడు నోరు బార్లా తెరిచాడు. "అదేంటి బావా. ఇన్నేండ్ల నుండి కలిసిమెలిసి వుంటున్నరాయె... మళ్ళా 'పడటం' లేదంటే నేనెట్లా చచ్చేదీ..."

"లేదురా.. నేను ఏది చెబితే 'అది' దాన్ని అడ్డంగా కాదని మోకాలు పెడుతుంది. కూరలో ఉప్పెక్కువైందంటే ఉరుముతుంది. బట్టలు ఇస్త్రీకిచ్చినావా అంటే ఈసడింపు..

బాబుగారింకా మాట పూర్తి చేయలేదు. లోపల్నుండి ధడధడమని పళ్ళాలు గల్లాలు నేల మీదికి విసిరి కొట్టిన చప్పుడు వినిపించి బాబుగారు తల పట్టుకుని 'ఇదిరా పరిస్థితీ' అని భారంగా ఓ నిట్టూర్పు విడిచాడు.

సోమయ్య అయోమయంగా చూసేంతలో అక్క హాలు దర్వాజా దగ్గరకు వచ్చి "ఇంగనేనీ కాపరం చేయలేను... మీతో వేగలేను... సడిపోయింది... నా కర్మ" అని భారీగా ప్రకటించి దఢాల్న కుర్చీ లాక్కుని ముడుచుకుని కూలబడింది.

"అసలేమయిందే అక్కా... ఎన్నడూ లేంది ఈ రుసరుసలేందే..." సోమయ్య అక్కగారిని దీనంగా అడిగాడు. ఆవిడ మూతి మూడు వంకర్లు తిప్పింది. తర్వాత "అదేరా.. ఎన్నికల సీజనోటి వస్తుంది గదా... మొన్నరాత్రి... మొన్న.."

బాబుగారు హఠాత్తుగా... "బామ్మర్దీ" అని పొలికేక ఓటి పెట్టి - శాంతించి సర్దుకుని బొళబొళా వెధవ నవ్వోటి నవ్వాడు. నవ్వి "అర్థమయిందిరా... అసలు తప్పంతా నాదిరా... ఈ మధ్యనే ఆ రాత్రి నేనే దానికి 'యాంటి ఇంకుబెన్సీ' అని ఓ మాట చెప్పాన్రా... అదే... అదీ...

"అదేంటి బావా.. ఇంకుబెన్సీ ఏందీ..." సోమయ్య అయోమయంగా అడిగాడు. బాబుగారు ఓ కసురు కసిరాడు. "ఒరే... నాకు మాత్రం పూరాగా దీని గురించి ఏం తెలుసు గనక.. ఏందో జనాలు అనుకుంటుంటే విన్నా - దాని గురించి నాకు తెలిసిందేదో దాన్తో వాగా... దాంతో అదినాతో యుద్ధానికి తగులుకుంది.." ఈ మాట ముగించేలోగా ఆవిడ ధుమధుమలాడుతూ లేచి ఇంట్లోకి వెళ్ళిపోయింది.

"ఆ యాంటి ఇంకుబెన్సీ దెబ్బకీ మొన్న మూడు రాష్ట్రాల్లో కాంగ్రెస్ ఓడిపోయింది. అంటే ఏంలేదురా బామ్మర్దీ... కొన్నేండ్లు 'పాలన' చేసింతర్వాత జనాలకు మంత్రుల మీద రోత పుడుతుందన్నమాట...

"మొహం మెత్తడం అన్రాదు!"

"గదే.. గదే... పూరాగా నాకైతే తెలవదు. కాని చూడ్రా... 'సుపరిపాలన' సాగిస్తే మాత్రం అట్లా జరగదు..." బాబుగారు విలాసంగా నవ్వాడు.

"ఏమోబావా... నువ్వు చెప్తుంటే అర్థమవుతుంది. రేపు ఎలక్షన్లోగాని నిలబడితే నువ 'టపాల్మని' పోవడం ఖాయమేనన్నమాట.

బాబుగారు సోమయ్య మాట పూర్తిగాకముందే వాడ్ని కసిగా ఓ పావుగంట బూతులు తిట్టాడు. సోమయ్య మొహం చిన్నబుచ్చుకున్నాడు.

"అదేంటి బావా... ఇంకుబెన్సి దెబ్బ నీకు తగలదా? ఎందుకు తగలదు - ఒక పక్క జనాలందరూ గోలగోలగా అరుపులకూ... తిట్లకూ తగులుకున్నారు గద....

"ఒరే దరిద్రుడా.... అసలు జనం వున్నది అరవడానికే గదరా... అరవనీ... అరిచి అరిచి వాళ్ళే వూరుకుంటారు... రహస్యం (మెల్లిగా) వాళ్ళతో బాటు మేమూ అరుస్తాం... సుపరిపాలన చేసే వాళ్ళకు ఇంకుబెన్సి దెబ్బ తగల్దురా...

"మరి 'సుపరిపాలన'లో జనం ఎందుకు అరుస్తరు? అదికాదుగాని బావా... మరిచిన పోరగాడి దగ్గర్నుండి ప్రతి ఒక్కడూ 'ప్రపంచ బ్యాంకో... అప్పుల దెబ్బో'... అని పాటలకు తగులుకున్నారేందీ?"

"అదే... అట్లాంటి వాటిని తిప్పికొట్టడానికే 'అభివృద్ధి కోసం అప్పులు' అని చెప్తున్నాంగద. అరె.. ఎంత అభివృద్ధి జరిగిందో కండ్లులేని కబోదికూడా తెలుసు. మేం డ్వాక్రా మహిళలకు సెల్‌ఫోన్లు ఇచ్చేదాకా పోయినామంటే ఏమిటర్థం... ఆఁ!"

"గానుబండలూ... సెల్‌ఫోన్లు తిండిపెట్టవనేగదా గోల...

"అదేరా.. తిండీ... తిండి... సుపరిపాలనంటే తెలవనివాళ్ళు వాగేది. 'అంతర్జాతీయ ఆటల' పోటీలు పెట్టినాకకూడా ఇంకుబెన్సీ ఎట్లా వుంటది? ఒరే... అసలు చేసిన అభివృద్ధీ... చేయవలసిన అభివృద్ధీ సరిగ్గా జనాలకు వూదర పెట్టకపోతే వాడు ఖతం! అభివృద్ధంటే మాటలా... బాల కార్మిక వ్యవస్థతో బాటు ఎయిడ్స్‌ను నిర్మూలించి పారేస్తున్నాం..

"బావా బావా.. నేనో మంత్రం చెప్తా... ఏం లేదు.. అసలేం చేయని అభివృద్ధిని గురించి కూడా బాగా వూదరపెడితే సరిపాయె... జనం ఆ 'యావ'లో పడి ఎదురు మాట్లాడరు. దభాయించి పారేస్తే...

బాబుగారి ఒళ్ళు మండిపోయింది. పండ్లు పటపట కొరికాడు "అదే... ఒరే.. ఆ విషప్రచారమే వద్దన్నది. అరె.. ప్రతి దానికీ వ్యతిరేక అర్థాలు పీకితే ఎట్లా.. ఒరే.. బాల కార్మికుల్ని లేకుండా చేసినామా లేదా...?"

"చేసింద్రు.. చాలామంది దరిద్రానికి తట్టుకోలేక పిల్లల్ని అమ్ముకుంటున్నారాయె - ఇంక పసిపోరగాండ్లెక్కడ? వాండ్లు పని చేసేదెక్కడ?" బాబుగారు కొరకొరా చూశాడు. "అది సరేరా.. చదువు.. రెండేండ్లలో 13% మాటలు కాదు.. చదువుల పండుగలు.. అక్షర సంక్రాంతి.. స్కూళ్ళలో టీవీలు.. వాటిల్లోనే పాఠాలు...

"అవును బావా - బళ్ళకు కరంటే లేదాయె - అవునులే - ఇరవై ఏండ్లలో మూడు శాతం... రెండేండ్లలో పదమూడు శాతం అంటే మూర్ఛపోవాలి.... బ్రహ్మాండం బావా..."

బాబుగారు మెచ్చుకోలుగా చూశాడు.

"కాని బావా... అభివృద్ధి హైటెక్కు బాగానే వుందిగానీ... అదే చిన్నా చితకా ఓ యాభై దాకా పథకాలనైతే ప్రకటించారుగానీ అందులో కొన్ని పేరుకే పరిమితమని జనాలంటున్నారు.... అబ్బో... పనికిరాని ఆదరణ.. రోష్ని... ఇంకా 'కోటివరాలు' మీద కోటాను కోట్ల గందరగోళాలు.. వీటన్నిటితో జనం కకావికలైపోతున్నారు బావా...

బాబుగారు కాసేపు ఆలోచనలో పడ్డాడు... "అంటే పథకాలంటేనే జనాలకు మొహం మొత్తిందంటావా!"

"నేననటం కాదు బావా.. వాళ్ళే.. ఎవడ్ని కదిలించినా అదేగోల! అద్సరెగాని బావా.. ఇంకుబెన్సీ అంటే నాకిపుడు బాగా అర్థమైపోయింది.. దాన్దెబ్బ నీకు తగుల్తది...!" అనగానే బాబుగారు నిరుత్తరుడయ్యాడు. "అదేందిరా.. అదేందో అసలర్థం కాలేదంటివి?" అని భీరువులా అడిగాడు.

"ఎలక్షన్లు వచ్చినపుడల్లా రకరకాల పథకాలంటున్నావ్. గివన్ని జనాలకు పనికొచ్చేవి కావు - ఒకరిద్దరికి లాభమయ్యేటివి! ఇంతకాలం ఎవడికి వాడు ఆ 'లాభం' తనదాకా రాదా? అని ఓపిక పట్టింద్రు - 32 వేల సెల్‌ఫోన్లిస్తే అరవై లక్షల దాకా డ్వాక్రా వాండ్లలో మిగిలినోల్లకు కడుపుమండదా? అదే.. అదే.. ఇంకుబెన్సీ..

"ఆఁ.. ఆఁ... అందరికీ యాడ్నుంచి తెచ్చిచ్చేది?" బాబుగారు బేలగా అన్నాడు.

"అదే.. చిన్నసైజు కంట్రాక్టు దొరికిన పచ్చచొక్కా వాళ్ళు బాగుపడిపోతుంటే, దొరకని మిగిలిన పచ్చచొక్కా వాళ్ళకు ఇంకుబెన్సీ.. అక్కోయ్.. అక్కా..!" అనేలోగా ఆవిడ సూటుకేసు సర్దుకుంటుంది. "ఏం లేదురా తమ్ముడూ.. మాచెల్లె పెండ్లుంది గదా.. ఏడు వారాల నగలు చేయిస్తానన్నాడా... రెండు వారాల జవ్వరీతో సరిపెట్టుకో అంటాడు. ఇస్తానన్నోడు అన్ని తెచ్చిపెట్టాలె.. పనికిమాలిన మాటలెందుకు? నువ్వింకేం చెప్పుకురా...

ఇంకుబెన్సీ ఇన్ని రకాలుగా కూడా వుంటుందని బాబుగారికి అపుడు తెలిసొచ్చేసరికి, మనిషి కుతకుత వుడికిపోయి కూలబడిపోయాడు! ●

✻ డా॥ పి.దక్షిణామూర్తి

ధనుర్వాతం

'క్లాస్ట్రీడియం టెటని' అనే సూక్ష్మ క్రిమి వల్ల వచ్చే అంటు వ్యాధిని 'ధనుర్వాతం' (టెటనస్) అంటారు. పశువుల మలంతో ఎరువు వేయబడిన మట్టిలో ఈ సూక్ష్మ క్రిమి ఉంటుంది. శరీరం మీది గాయాలు ఈ సూక్ష్మక్రిముల స్పోరులతో మలినం అయినపుడు ధనుర్వాతానికి దారి తీస్తుంది. ఈ స్పోరులు శరీరంలోకి ప్రవేశించి ఉత్పత్తి చేసే శక్తివంతమైన 'ఎక్సోటాక్సిన్' నరాల ద్వారా వ్యాపించి ధనుర్వాత లక్షణాలు కలిగిస్తాయి. రోడ్డు ప్రమాదాలు మొదలైన వాటిలో తగిలే తీవ్రమైన గాయాలు, బాగా క్రిమిదోషం పట్టిన గాయాలు ఈ వ్యాధికి దారితీయడానికి ఎక్కువ అవకాశం వున్నా, స్వల్పమైన గాయాల్లోనూ, కొద్దిగా చర్మం రాచుకుపోవడం వల్లా కూడా ధనుర్వాతం రావచ్చు.



గ్రామాల్లో శిక్షణ పొందని మంత్రసానులు ఇప్పటికీ ప్రసవ సమయంలో సాయపడుతున్నారు. ఇళ్ళలో అపరిశుభ్రమైన పరిసరాల్లో పసిబిడ్డ బొడ్డు కోయడానికి కొడవలి, బ్లేడు ఉపయోగించడం వంటి పనుల వల్ల పసిపిల్లలకు, తల్లికి ధనుర్వాతం వచ్చే అవకాశం వున్నది. గర్భస్రావం జరిగినపుడు, ముఖ్యంగా అశాస్త్రీయ పద్ధతుల్లో గర్భస్రావం జరిపినప్పుడు ఈ వ్యాధి వచ్చే అవకాశం ఎక్కువ, ఆస్పత్రులలోను, మెటర్నిటీ హోమ్‌లలోను కాన్పు అయితే ఈ వ్యాధి సాధారణంగా రాదు. గర్భిణీ స్త్రీలకు తప్పనిసరిగా వ్యాధి నిరోధక 'టెటనస్ టాక్సాయిడ్' (టెట్‌వాక్) ఇస్తూ వుండడం వల్ల ఈ వ్యాధి తల్లీ, పిల్లల్లో రావడం తగ్గిపోయింది. తుప్పు పట్టిన మేకులు, పొలాలలో ముళ్ళు గుచ్చుకుంటే ధనుర్వాతం రావచ్చు. కండరాలకు బాగా బాధ కలిగించే క్వినైన్, ఎమిటిన్ వంటి ఇంజక్షన్లు చేసినపుడు కూడా తగు జాగ్రత్తలు తీసుకోకపోతే వ్యాధి రావచ్చు. ముఖ్యంగా సరిగ్గా స్టెరిలైజ్ చేయని సూదులతో స్వయంగా ఇంజక్షన్లు చేసుకొనే (డ్రగ్ ఎడిక్ట్స్) అలవాటు వున్న వారిలో వ్యాధి రావడానికి అవకాశాలు ఎక్కువ.

వాక్సినేషన్ వల్ల శస్త్రచికిత్స అనంతరం కూడా అరుదుగా ధనుర్వాతం రావచ్చు. శస్త్రచికిత్స చేసే థియేటర్‌లో దుమ్ము నుంచి మలినమైన డ్రెస్సింగ్ మెటీరియల్ నుంచి వ్యాధి వ్యాపించవచ్చు. మన దేశంలో పిల్లలలో చెవి నుంచి చీముకారే లక్షణాలున్న 'ఆటైటిస్ మీడియా' వంటి వ్యాధులలో కూడా ధనుర్వాతం రావచ్చు. శరీరం కాలినపుడు, జంతువులు కరిచినప్పుడు, పేలుడు వస్తువుల వల్ల తగిలిన గాయాలలోను, ప్రమాదాలలో ఎముకలు విరిగినప్పుడు ధనుర్వాతం రావచ్చు. కొన్ని తెగలలో ఆచారంగా వుంటున్న సుంతీ చేసినపుడు, చెవులు కుట్టినపుడు, మనిషి కొరికినపుడు, దీర్ఘకాలంగా వున్న పుళ్ళవల్ల, ప్లాస్టర్ మూలంగాపడే పుళ్ళవల్ల, దంతాలు పెరికినప్పుడు కూడా ధనుర్వాతం రావచ్చు.



సూక్ష్మజీవులు శరీరంలో ప్రవేశించిన 4 నుండి 30 రోజుల్లోగా ఈ వ్యాధి లక్షణాలు కన్పించవచ్చు. దవడ కండరాలు, గొంతులోని కండరాలు బిగుసుకుపోవడం వల్ల రోగికి నోరు తెరవడం, మింగడం కష్టం అవుతుంది. వీపు, పొట్ట, మెడ కండరాలు బిగిసి రోగి ప్రత్యేక తరహాలో వుంటాడు. ముఖ కండరాలు బిగుసుకుపోయి, కనుబొమ్మలుపైకి లేచి కళ్ళు మూయడం, పళ్ళు బిగించడం వంటి లక్షణాలున్న రోగిని డాక్టర్లు తేలికగా గుర్తిస్తారు. తీవ్రమైన దశలో పైన చెప్పిన కండరాలలో తెరలు వచ్చి బాధపడతాడు. ధ్వనుల వల్ల, ఇంజక్షన్ చేస్తున్నప్పుడు, కారణం లేకుండానే తరచుగా ఈ తెరలు రావచ్చు. ముదిరిన దశలో ఊపిరి ఆడకపోవడం, బ్రాంకో న్యూమోనియా, షాక్‌వంటి కాంప్లికేషన్లతో రోగి మరణించవచ్చు.

వ్యాధి లక్షణాలు కనపడగానే తీసుకువెడితే, రోగిని అంటువ్యాధుల ప్రత్యేక ఆస్పత్రిలోగాని, సాధారణ ఆస్పత్రి ప్రత్యేక

విభాగంలోగాని చీకటిగా, నిశ్శబ్దంగా వుండే గదులలోగాని వుంచి చికిత్స చేస్తారు. ముదిరిన దశకు రాని రోగులు ఆధునిక వైద్య చికిత్సతో పూర్తిగా కోలుకునే అవకాశం వుంది.

ఈ వ్యాధికి చికిత్స చేయడం కంటే నివారించడం చాలా తేలిక. పసిపిల్లలకు మూడు డోసుల ట్రిపుల్ వాక్సిన్ (ధనుర్వాతం, డిఫ్తీరియా, కోరింత దగ్గులను నివారించే వాక్సిన్) ఇవ్వాలి. మూడవ నెలలో మొదటి డోసు, 4వ నెలలో రెండవ డోసు, 5వ నెలలో మూడవ డోసు ఇవ్వాలి. ఈ విధంగా ప్రతి పసిబిడ్డకూ వ్యాక్సిన్ ఇవ్వడం ద్వారా అభివృద్ధి చెందిన దేశాలలో ధనుర్వాతాన్ని దాదాపు పూర్తిగా నిర్మూలించగలిగారు. ఒకటిన్నర సంవత్సరం వచ్చాక ట్రిపుల్ వ్యాక్సిన్ బూస్టర్ డోసు మరల ఇవ్వాలి. 5 సంవత్సరాల వయస్సులో ప్రాథమిక పాఠశాలలో చేరే ముందు 'టెటనస్-డిఫ్తీరియా వ్యాక్సిన్' బూస్టరు డోసు ఇవ్వాలి. తరువాత ప్రతి ఐదేళ్ళకొకసారి టెటనస్ టాక్సాయిడ్ ఇంజక్షన్ తీసుకోవాలి.

ఇక గాయం అయినపుడు రోగ నిరోధక శక్తిని కలిగించే టెటనస్ టాక్సాయిడ్ (టెట్‌వాక్) 1 సి.సి. చేయించుకోవాలి. 6 వారాల తరువాత రెండవ ఇంజక్షన్, రెండు నెలల తరువాత మూడవ ఇంజక్షన్ చేయించుకోవాలి. అలాగే దీనితో పాటు 'ఏంటీ టెటనస్ సీరం' (ఎ.టి.ఎస్.) ఇంజక్షన్ చేయించుకోవాలి. దీనికి కొంతమందికి ఎలర్జీ వచ్చే అవకాశం వున్నందువల్ల పడుతుందో లేదో టెస్ట్ చేయించుకొని తీసుకోవాలి. ఎ.టి.ఎస్. బదులు 'హ్యూమన్ టెటనస్ ఇమ్యునో గ్లోబ్యులిన్' (హెచ్.టి.ఐ.జి) ఎటువంటి ఎలర్జీ కలిగించకుండా మంచి ఫలితాలను ఇస్తున్నది.

గాయాన్ని వైద్యుడు శుభ్రపరచి, బయటి పదార్థాన్ని తీసివేసి తగు చికిత్స చేసి, యాంటీ బయాటిక్ ఔషధాలను వాడడం వల్ల ధనుర్వాతం రాకుండా వుంటుంది. ప్రసవ సమయంలో తల్లీ బిడ్డలకు ధనుర్వాతం రాకుండా గర్భిణీ స్త్రీలకు 4-6 మాసాల మధ్య ఒకస్సారి, 6-8 మాసాల మధ్య రెండవ సారి విధిగా టెటనస్ టాక్సాయిడ్ తీసుకోవాలి. కర్మాగారాలలో, కార్ఖానాలలో, పొలాలలో పనిచేసేవారు ఎటువంటి చిన్న గాయమైనా విధిగా 'టెట్‌వాక్' తీసుకోవాలి. వ్యాధి వచ్చాక బాధలు పడే కంటే, నివారణ అతి ముఖ్యం అని మనకు తెలియజెప్పే వ్యాధి ధనుర్వాతం. ●

మద్యపానం వల్ల అనర్థాలు

ప్రస్తుతం సమాజాన్ని పట్టి పీడిస్తున్న సాంఘిక దురలవాట్లలో తాగుడు ముఖ్యమైనది. ఆల్కహాల్ మనిషిని ఉత్తేజపరచడం వాస్తవం కాదని, దాని ప్రాథమిక గుణం మెదడును నిస్తేజపరచడమేనని వైద్యశాస్త్రం వెల్లడిస్తున్నది. మితిమీరి తాగితే మనిషి ఆలోచనాశక్తి, శ్రద్ధ, సునిశితమైన నిర్ణయశక్తి, నడవడిక కూడా మందగిస్తాయి. మరీ విపరీతంగా తాగిన మనిషి అపస్మారక స్థితిలోకి పోవచ్చు. కొన్ని సందర్భాలలో అతిగా తాగిన మనిషి 'శ్వాసక్రియ నిశ్చలనం' వల్ల మరణించవచ్చు కూడా. చాలామంది అనుకునే విధంగా ఆల్కహాల్ లైంగికశక్తి ప్రేరేపకం కాదు. షేక్స్పియర్ రాసినట్లు 'ఆల్కహాల్ కోరికను పుట్టిస్తుంది. కానీ క్రియాశక్తిని తగ్గిస్తుంది'.

● ఆల్కహాల్‌ను కొన్ని వ్యాధుల్లో ఔషధంగా వాడవచ్చునని కొందరు అనుకునే విషయం యదార్థం కాదు. మితిమీరి తాగడం వల్ల లివర్ దెబ్బతిని 'హెపటైటిస్', 'సిర్రోసిస్' అనే వ్యాధులు తరచుగా వస్తాయి. పొట్టకు నీరు, స్ప్లీన్ పెరగడం, వాంతిలో రక్తం పడడం, తీవ్ర స్థితిలో అపస్మారక దశలోకి వెళ్ళడం వంటి లక్షణాలు ఉండే 'సిర్రోసిస్' వ్యాధిలో తాగుడు మానితే వ్యాధి కొంత వెనకాడుతుంది. తాగుడు మానకపోతే ఈ జబ్బు వల్ల రోగి మరణిస్తాడు. 'గ్యాస్ట్రయిటిస్' అనే ఉదర వ్యాధి, 'పేంక్రియాటైటిస్' అనే వ్యాధి, గుండె కండరం దెబ్బతినే 'ఆల్కహాలిక్ కార్డియోమయోపతి' అనే వ్యాధి, కాళ్ళు, చేతుల నరాలు బలహీనం చెంది తిమ్మిరులు, బండబారడం వంటి లక్షణాలు ఉండే 'పెరిఫెరల్ న్యూరైటిస్' అనే వ్యాధి తాగుడుకు అలవాటు పడిన వారిలో వస్తుంటాయి. తాగుడు పూర్తిగా మాని, వైద్యుని సలహాపై తగు చికిత్స చేయించుకుంటే ఈ వ్యాధులను తగ్గించుకోవచ్చు.

బరువు తగ్గదలచుకున్నవారు, రక్తపోటు, మధుమేహం, గుండె జబ్బు ఉన్నవారు మద్యం సేవిస్తే శరీరం మరిన్ని కేలరీలు పెరగడమే కాక, ఆ వ్యాధులు పెరిగే అవకాశం ఉన్నది. ఒక గ్రాము ఆల్కహాలు 7.1 కేలరీల శక్తిని ఉత్పత్తి చేస్తుంది. మనిషిలోని నేర ప్రవృత్తి, హింసా ధోరణులు పెరగడానికి, మోటారు ప్రమాదాలు జరగడానికి, కుటుంబాలు విచ్ఛిన్నం కావడానికి, ఇంకా అనేక సాంఘిక రుగ్మతలకు మద్యపానమే ముఖ్య కారణం అని మనందరికీ తెలుసు. మితిమీరి దీర్ఘకాలం తాగే వ్యక్తి అవసాన దశలో జ్ఞాపకశక్తిని కోల్పోయి నడకలోనూ, అలవాట్లలోనూ వికృత రూపం దాల్చి పూర్తి ఉన్మాది అయ్యే అవకాశం ఉన్నది. పేద ప్రజలు తాగే సారాయిలో 'మిథిలేటెడ్ స్పిరిట్'తో కల్తీ జరిగినప్పుడు, అలాంటి కల్తీ సారాయి తాగిన వారు ప్రాణాలు కోల్పోవడమూ, చూపును పోగొట్టుకోవడమూ వంటి సంఘటనలను అరుదుగా పత్రికలలో చూస్తున్నాము.

తాగుడు అనేది ఒక 'వ్యాధి' అని మనం గుర్తించాలి. మానసిక కారణాల వల్ల, వృత్తులలో ఒత్తిడి వల్ల, సాంగత్యం వల్ల, ఇంకా అనేక కారణాల వల్ల మనిషి తాగడం ప్రారంభిస్తాడు. తాగుడు మానడానికి మన ప్రోత్సాహంతో పాటు ఆ వ్యక్తి కూడా మానాలని నిర్ణయం చేసుకోవాలి. మనం ఎదుటపడి వాదించకుండా, తన బలహీనత వల్ల కలుగుతున్న నష్టాలను తెలుసుకునేటట్లు చేయాలి. 'ఆల్కహాలిక్ ఏనానిమస్' వంటి స్వచ్ఛంద సంస్థలు ప్రచురించే కరపత్రాలను అతను చదివేటట్లు చేయాలి. తాగుడు మానడానికి అతను ఆసక్తి చూపిస్తే డాక్టర్‌ను కలిసేందుకు ప్రోత్సహించాలి. మితిమీరి తాగే వ్యక్తులు మద్యపానాన్ని అకస్మాత్తుగా ఆపితే వణుకు, ఆందోళన మొదలైన లక్షణాలు కలగవచ్చు. కుటుంబ వైద్యుని లేదా మానసిక వైద్య నిపుణుని పర్యవేక్షణలో 'యాంటబ్యూజ్' వంటి ఔషధాల ద్వారా తాగుడు అలవాటును మానుకోవచ్చు. తాగుడును మాన్పించడంలో ఔషధాలకంటే 'ఆల్కహాలిక్ ఏనానిమస్' వంటి సంస్థల కృషి ఉపయోగకరమని చెప్పవచ్చు.

తాగుడు మానాక మనస్సును ఇతర వ్యాపకాలపై కేంద్రీకరించాలి. తాగని స్నేహితులతో సాంగత్యం చేయాలి. ఏ పరిస్థితుల్లో లోగడ తాగుడుకు అలవాటు పడడం జరిగిందో ఆ పరిస్థితులకు దూరంగా ఉండాలి. జీవితంలో ఎదురయ్యే ఎదురు దెబ్బలకు చలించకుండా ధైర్యంగా ఉండాలి. ఆకలిగా ఉన్నప్పుడు, కోపంగా ఉన్నప్పుడు, ఒంటరిగా ఉన్నప్పుడు, అలసిపోయినప్పుడు, దాహంతో ఉన్నప్పుడు మరల తప్పటడుగు వేయకుండా మనసును నిగ్రహించుకోవాలి. నేటి సమాజంలో పేద, మధ్య తరగతి, ఉన్నత వర్గాలన్నింటిలోనూ నానాటికి ప్రబలుతున్న మద్యపాన పిశాచిని అరికట్టాలంటే బాపూజీ బోధనలను అనుసరించి ప్రజలు, ప్రభుత్వం కృషి చేయాలి. ●

ఉర్రూతలూపిన ఎల్బీ నాటికల సంకలనం

"మరదే" అంటూ తెలుగు సినిమా ప్రేక్షకులను నవ్వులలో ఓలలాడించి, తన కంటూ ఒక బాణీ ఏర్పరచుకున్న ఎల్బీశ్రీరాం రెండు దశాబ్దాల నాటి తన నాటకాలతో వెలువరించిన అందమైన, విభిన్నమైన సంకలనం 'ఎల్బీ రంగస్థల రచనాభిషేకం". ఈ నాటకాల కూర్పు, ముద్రణ, ఆలోచన అన్ని విలక్షణంగా వుండటం విశేషం. నాటకరంగం నుంచి సినిమా రంగానికి వచ్చిన చాలా మంది తమ పాదాలు అక్కడే వున్నాయన్న సంగతి మరచిపోతుంటారు. వారిలో కొందరు మాత్రమే సినిమాలలో బిజీగా వున్నా రంగస్థలం పట్ల తమ అభిమానాన్ని, మొగ్గును స్పష్టంగా చూపిస్తుంటారు. ఎల్బీ ఆ కోవలో తన స్థానాన్ని సుస్థిరపరుచుకోవడం సంతోషించవలసిన విషయం.

ఎ4 సైజులో 260 పేజీలతో, మంచి నాణ్యమైన ముద్రణతో వెలువడిన ఈ పుస్తకంలో మొత్తం ఏడు నాటికలున్నాయి. లంకాదహనం (1979), హుష్‌కాకి (1979), పంచతంత్రం (1980), పద్మవ్యూహం (1982), గజేంద్రమోక్షం (1983), జాగృతి (1984), ఒంటెద్దుబండి (1988) నాటికలు ఈ సంకలనంలో వున్నాయి. నాటకరంగంలో ప్రగతిశీల భావాలతో, పరిషత్తులు, పోటీలతో పరిచయం వున్నవారికెవరికైనా ఈ జాబితా చప్పట్లను, మెమొంటోలను గుర్తుచేయడం అత్యంత సహజం.

ఇరవయ్యేళ్ల తర్వాత ఈ నాటకాలను ఒక ప్రత్యేక వేడుకగా రవీంద్రభారతిలో ప్రదర్శించిన అనంతరం సంకలనంగా తీసుకొచ్చారు. ప్రతి నాటికకూ గొల్లపూడి, గణేష్ పాత్రో, ఆదివిష్ణు, ఎం.వి.ఎస్.హరనాథరావు, తనికెళ్లభరణి ఇలా సినీ నాటక సవ్యసాచులు సరికొత్త పీఠికలు రాశారు. రాసిన వాటిలో తరతమ తేడాలున్నా ఎవరూ లాంఛనంగా సరిపెట్టలేదు: స్పందించి రాశారు.

రూపకల్పన పరంగా ఈ సంకలనంలో అతి పెద్ద విశేషం- అర్థవంతమైన ప్రయోగం సన్నివేశాలకు అనుగుణంగా బొమ్మలు వేయించడం. బాపు ముఖపత్ర రచన చేశారు. చంద్ర, బాలి, మోహన్, సుబానీ, బ్నిం, భాస్కర్ చిత్రాలు వేశారు. ఇందరి రేఖా విన్యాసాలతో వైవిధ్యం పుష్కలంగా సమకూరింది. కన్యాశుల్కంలో పాత్రలకు బాపు గీసిన బొమ్మలు వచ్చాయి గాని, ఇలా నాటక ఘట్టాలను విజువలైజ్ చేసి

ఎల్బీ రంగస్థల రచనాభిషేకం

సంపాదకవర్గం : పసుమర్తి నాగేంద్ర కుమార్, కె.ఎన్.భాస్కర్, డి.చంద్రశేఖర్; వెల : రూ.100/-; ప్రతులకు : ప్రజాశక్తి బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలు, విశాలాంధ్ర బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలు

బొమ్మలేయించడం ఇదే ప్రథమం కావచ్చు. షేక్స్‌పియర్ నాటకాల ప్రచురణలో వాటి సుప్రసిద్ధ ప్రదర్శనల తాలూకూ ఫోటోలు (తేదీలతో సహా) ఇచ్చిన పద్ధతిని కూడా పాటించవచ్చు- ఆ విధంగా ఈ నాటకాలకు ప్రాణం పోసిన బృందాలను కూడా భాగస్వాములను చేసినట్టవుతుంది. వాస్తవానికి ముఖచిత్రంపై శ్రీరాం బొమ్మ ముచ్చటగానే వున్నా ఆయన నాటకాల తాలూకూ బొమ్మలు వుంటే ఇంకా బావుండేది.

80 వ దశకం నాటి సామాజిక, రాజకీయ పరిస్థితులు ఈ నాటకాలు చదివినపుడు ఒక్కసారి కళ్లముందు కదలాడతాయి. సామాన్యుడి సమస్యలను ప్రతినాటికా స్పృశిస్తుంది. ఒక్కొక్క దానిలో ఒక సమస్యను తీసుకున్నారు. లంకాదహనంలో ఎంప్లాయిమెంటు ఎక్స్చేంజిల భాగోతం, పద్మవ్యూహంలో రేషన్ కార్డులు ఆస్పత్రులు, పోలీస్ స్టేషన్‌లలో అవినీతి విలయ స్వరూపం, గజేంద్రమోక్షంలో మద్యపానాన్నిపెంచి పోషించే సర్కారీ విధానం, జాగృతిలో రాజకీయ అవినీతిపై నిజాయితీ పరుడైన అధికారి పోరాటం, ఒంటెద్దుబండిలో బతకలేని మధ్యతరగతి గృహంలో వృద్ధజీవుల వ్యథాభారతం దర్శనమిస్తాయి. ఇక పంచతంత్రం నమూనాలో జంతువులకన్నా మనుషులు హీనమైనట్టు చెప్పే వివిధాంశాల కలబోత వుంటుంది. ఈ నాటికలన్ని వాటికవేగా సాగుతాయి గాని దర్శకుడు, రచయిత వచ్చి డైలాగులు చెప్పడం వుండదు. అలాగని సందేశాలుండవని కాదు- అవి పాత్రల ఉపన్యాసాల తరహా ఎక్కువగా వుందని చాలా మంది పీఠికా కర్తలురాశారు. అయితే ఈ నాటికలలో ఒక ప్రధాన సుగుణాన్ని కూడా అవి ప్రతిబింబిస్తాయి. అదే వాటిలోని ఆగ్రహం. అదే శ్రీరాం రచనలను జనప్రియం చేసింది. కొన్ని పరిమితులున్నా సామాజిక రుగ్మతల సమగ్ర విశ్లేషణలు లేకపోయినా అసంతృప్తి, ఆగ్రహం ప్రతిధ్వనించే సృజనాత్మక కృషికి ఆదరణ ఎప్పుడూ వుంటుంది. ఉత్తేజ పరచాయి కూడా. సమకాలీనంగా కొందరు సీనియర్ రచయితలు ప్రయోగాల పేరుతో తాడూ బొంగరం లేని రచనలు చేస్తున్న పరిస్థితులలో శ్రీరాం వంటి యువ నాటకకర్తలు ఆ కారణంగానే ప్రగతి శీల నాటక బృందాలను ఉత్సాహపరచారు. ప్రజానాట్యమండలి బృందాలు పద్మవ్యూహం ను నృత్యనాటికగా కూడా మలచి ప్రదర్శించాయి.

ఇక ప్రక్రియా పరంగా కూడా శ్రీరాం నాటికలు ఆధునికతకు దర్పణం పడతాయి. రంగస్థల ప్రదర్శనల వ్యయప్రయాసలు పెరిగిపోయిన దశలో తక్కువమంది నటులతో ఎక్కువ పాత్రలను ప్రదర్శించే పద్ధతులను స్థిరపరచిన వారిలో ఆయనొకరు. స్త్రీ పాత్రలు లేని నాటికలే ఎక్కువగా రాసినా, వున్న వాటిలో కూడా ఆనాటి తరహా ఉత్తుత్తి చప్పట్ల డైలాగులకు ప్రాధాన్యత నివ్వకపోవడం గుర్తించదగ్గ విషయం. ప్రస్తుతం మనం చూస్తున్న సామాజిక కల్లోలాల పూర్వరంగాన్ని వీక్షిస్తున్న అనుభూతినిచ్చే ఈ నాటికల సంపుటానికి ధర కూడా ఎక్కువ కాదు కనక చింతనాపరులు, ప్రత్యేకించి నాటకాభిమానులు కళాహృదయులు దీన్ని తప్పక ఆదరించాలి, అధ్యయనం చేయాలి. ఈ సంపుటం వెలువడ్డానికి దోహదం చేసిన వారంతా అభినందనీయులు. ●

స్వీకారం



ఆదర్శబాల్యం

సంకలనం, కథనం, **బొమ్మలు :** తుంబలి శివాజీ; వెల : రూ. 25/-; **ప్రతులకు :** ప్రజాశక్తి బుక్ హౌస్ అన్ని బ్రాంచీలు



భారతీయ శాస్త్రజ్ఞులు

సంకలనం, కథనం : వి.ఉదయలక్ష్మి; వెల : రూ. 15/-; **ప్రతులకు :** ప్రజాశక్తి బుక్ హౌస్ అన్ని బ్రాంచీలు





వేయి స్తంభాల గుడి

ఏడు వందల సంవత్సరాల క్రితం ఓరుగల్లు రాజధానిగా (నేటి వరంగల్) కాకతీయ చక్రవర్తులు పరిపాలించింది 150 సంవత్సరాలే అయినా ఆంధ్రుల చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయారు. ఓరుగల్లు కోట, ఏకశిలా నగరం, వెయ్యిస్తంభాల గుడి, భద్రకాళి గుడి ఇవన్నీ వరంగల్ నగరంలో చూడాల్సినవి కాగా జిల్లాలో రామప్ప దేవాలయం, పాకాల చెరువు, వన్యమృగసంరక్షణ ప్రదేశాలు పర్యాటకంగా అభివృద్ధి చెందాయి.

చారిత్రక నగరం ఓరుగల్లు

కాకతీయుల రాజధానిగా విలసిల్లిన వరంగల్ నగరం రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌కు 157 కిలోమీటర్ల దూరంలోనే ఉంది. శత్రురాజుల దాడికి శిధిలమైనా ధీటుగా నిలబడిన ఓరుగల్లు కోట ముఖద్వారం ఆనాటి ధీరత్వానికి ప్రతీకగా కనిపిస్తుంది. ఎంతో అందమైన, శిల్పకళావైభవంతో కూడిన కోటశిధిలాలు అక్కడ కనిపిస్తాయి. వరంగల్, హనుమకొండ నగరాల్లో 19 కిలోమీటర్ల పరిధిలో ఈ కోట పునాదులు కనిపిస్తాయి. 45 ఎత్తైన శిఖరాలతో 8 కిలోమీటర్ల పరిధిలో ప్రధానకోట నిర్మాణం విస్తరించినట్లుగా ఇప్పటికీ అక్కడి కోట ఆధారాలు కనిపిస్తాయి.

వరంగల్ కోటలోనే గల ఏకశిలా పర్వతంపై గల మాత ఓరుగల్లు రాజుల ఆరాధ్య దైవం. ఈ పర్వతంపైనే కూర్చుని బమ్మెర పోతనామాత్యుడు భాగవతం రచించాడంటారు.

వెయ్యి స్తంభాల గుడి

కాకతీయుల కళాతృష్ణకు, వారి శిల్పకళా నైపుణ్యానికి వరంగల్ నగరంలోని వెయ్యి స్తంభాల గుడి అద్దంపడుతుంది. ప్రతాపరుద్ర దేవుని కాలంలో క్రీస్తు శకం 1163లో దీని నిర్మాణం చేపట్టారు. చాళుక్యుల శిల్పకళా రీతిలో వెయ్యిస్తంభాలతో నిర్మించిన ఈ ఆలయాన్ని శివుడు, విష్ణువు, సూర్యుడికి అంకితమిచ్చారు. అందుకే ఇది త్రికూటాలయంగా ప్రసిద్ధి పొందింది. అందమైన శిల్పాలతో ఈ ఆలయం ముచ్చటగొలుపుతుంది. నగరంలోని భద్రకాళి ఆలయం కూడా ప్రసిద్ధి పొందింది.

రామప్ప దేవాలయం

ఏడవ కాకతీయ రాజు రుద్రసేనాని 1213వ సేనాని కాలంలో దీన్ని నిర్మించారు. ఈ ఆలయం అద్భుత శిల్పాలకు నిలయం. నిర్మాణానికి ఎంతో చరిత్ర ఉంది. వరంగల్ నగరానికి 64 కిలోమీటర్ల దూరంలో దట్టమైన అడవుల నడుమ గల ఈ ఆలయం పర్యాటకులను ఎంతగానో ఆకర్షిస్తుంది.

వరంగల్ నగరానికి 50 కిలోమీటర్ల దూరంలో చుట్టూ దట్టమైన అడవుల నడుమ గణపతి దేవచక్రవర్తి పాకాల చెరువు నిర్మాణం చేయించారు. దీని చుట్టూ 900 చదరపు కిలోమీటర్ల పరిధిలో దట్టమైన అడవులు విస్తరించి ఉన్నాయి. అందులో పులులు, చిరుతల వంటి వందలాది రకాల జంతువులు, పక్షులు ఉన్నాయి.

కొలనుపాక జైన ఆలయం

నల్గొండ, వరంగల్ జిల్లాల సరిహద్దులో గల కొలనుపాక ఒకనాడు ప్రసిద్ధ జైన కేంద్రంగా విలసిల్లింది. అక్కడ గల జైన ఆలయం ఇప్పటికీ దేశవ్యాప్తంగా జైనుల తీర్థస్థలం. ఇందులో అత్యంత అరుదైన, విలువైన జైన విగ్రహం ఉంది. కల్యాణీ చాళుక్యుల రాజధానిగా ఉన్న కొలనుపాక వీరశైవ కేంద్రంగా కూడా పేరొందింది. ఖాజీపేట రైల్వే స్టేషన్‌కు రెండు కిలోమీటర్ల దూరంలో గల దర్గా అన్ని మతాల వారికి ఆరాధ్యకేంద్రం. పర్యాటక కేంద్రాలన్నింటా వసతి నిమిత్తం వివిధశాఖల వసతిగృహాలు ఉన్నాయి. రవాణా సౌకర్యాలు కూడా తగినవిధంగా ఉన్నాయి. •



రామప్ప దేవాలయం

✻ ఆర్.రమేష్



పోరాటాల పొలికేక డప్పు

నవంబర్ 6-16, 2003

ఆ పది రోజులు ఆ ఊరు డప్పుల చప్పుళ్ళతో మారు మోగింది. ఆ ఊరు సిరిపురం. జిల్లా నల్లగొండ. మండలం రామన్నపేట. అక్కడ జరుగుతున్నవి ప్రజానాట్యమండలి రాష్ట్రస్థాయి డప్పుల శిక్షణా శిబిరాలు... డప్పు గొంతు చాలా శ్రావ్యమైనది. కఠినమైనది. అత్యంత శక్తివంతమైనది. అది కమ్మని పాటకు, కనువిందు చేసే ఆటకు ఆలంబన... డప్పు ఒక సందేశం... డప్పు ఒక హెచ్చరిక... అది అణగారిన వర్గాల అభివ్యక్తీకరణ...

పెళ్ళికి డప్పు, చావుకు డప్పు, ఉత్సవాల్లో డప్పు, ఊరేగింపులో డప్పు... తిరణాల ప్రభల్లో డప్పు, బహిరంగ సభల్లో డప్పు... డప్పు లేని మానవ జీవితాన్ని ఊహించలేం....

డప్పు నిదురించే జాతిని కదిలించే సాధనం...

నెత్తురు మండిస్తుంది. గుండెను రగిలిస్తుంది..

అందుకే ప్రజానాట్యమండలి ఆ డప్పును తన భుజాన వేసుకుంది. దానికొక సామాజిక ప్రయోజనాన్ని కల్పించింది. తెలుగునేల నలుచెరగులా దాని సృజనాత్మకతకు పదును పెడుతుంది. అందుకు

అరవై నాలుగు కళల్లో అందమైనది. అపురూపమైనది. ఒక్క చిత్రకళే! అనడాన్ని నిజం చేస్తూ నిఖార్సైన నిండుదనపు సజీవ చిత్రాలకు జీవం పోస్తున్న కుంచె బ్రహ్మలకు నిలయం మన ఆంధ్రదేశం.

బహుకళాబ్ధి 'ఋషి' - రెడ్డిబోయిన

వయసులో వృద్ధుడైనా... కృషిలో మాత్రం నిండు యువకుడే! చిత్రకళా అధ్యాపకునిగా అపూర్వ సేవలు అందించి ప్రస్తుతం విశ్రాంత జీవితం గడుపుతున్న రెడ్డిబోయిన వెంకటేశ్వర్లు. 'వి.ఆర్.రెడ్డిబోయిన'గా ఆకాశవాణి శ్రోతలకు సుపరిచితులు. ప్రముఖ చిత్రకారుడు 'ఉల్చి'కి సోదరుడైన రెడ్డిబోయిన తండ్రి కోటయ్యగారు కూడా చిత్రకారుడే అవడం ఆయన అదృష్టం. చిత్రకారుల కుటుంబానికి చెందిన రెడ్డిబోయిన గారు కేవలం చిత్రకారునిగానే గాక నఖచిత్రకారునిగా కవిగా, చక్కని గాయకునిగా మంచి నటునిగా బహుముఖ కళారంగాల్లో పునీతుడయ్యారు.

ఒంగోలు వద్ద గల 'ఉలిచి' గ్రామానికి చెందిన రెడ్డిబోయిన 1929లో జన్మించారు. మొదట తండ్రి వద్దే చిత్రలేఖనంలో ఓనమాలు దిద్దుకున్న ఈయన ఏలూరుకు చెందిన ఎం.సూర్యనారాయణ వద్ద క్రేహౌండ్ డ్రాయింగ్, పెయింటింగ్ అంశాల్లో శిక్షణ పొందారు. అంతేగాక మద్రాసుకు చెందిన సినీ ఆర్ట్ డైరెక్టర్ సూరన్న వద్ద ఆయన నఖచిత్ర కళలో శిక్షణ పొందారు. హయ్యర్ గ్రేడ్ టీచర్ ట్రైనింగ్ కోర్సు పూర్తి చేసి మద్రాసు ప్రభుత్వపు ఫైన్ ఆర్ట్స్‌లో డిప్లమా సాధించారు. పెయింటింగ్‌లో ప్రథమ శ్రేణిలో పాస్ అయిన రెడ్డిబోయిన చిత్ర కళా అధ్యాపక జీవితం 1947లో వేటపాలెంలో వయోజన విద్యా శిక్షణా కేంద్రంలో ప్రారంభమై వివిధ పాఠశాలలో చిత్రకళా అధ్యాపకునిగా పని చేశారు. వారి వద్ద శిక్షణ పొందిన పలువురు వివిధ సంస్థల్లో చిత్రకారులుగా ఆర్ట్ టీచర్స్‌గా సేవలు అందిస్తున్నారు.

'రెడ్డిబోయిన' వారి చిత్రాలు సహజత్వం, నిండుదనం - నిరాడంబరత కలబోసుకుని చిత్రకళా విలువలకు



నిలువుటద్దం పడతాయి. వీరి చిత్రాల్లో జానపద శైలి ఎక్కువగా అగుపిస్తుంది. ఈయన వేసిన దళిత కళారూపమైన 'చిందుభాగవత జానపద నృత్యపు చిత్రం ఉత్తమ చిత్రంగా నిలిచింది. అలాగే నాదబ్రహ్మ త్యాగరాజు. విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్, మహాశక్తి స్వరూపిణి వంటి చిత్రాలు పలువురి ప్రముఖుల ప్రశంసలందుకున్నాయి. అంతేగాక నైపుణ్యపు నగిషీలైన ఇందిరాగాంధీ, జీసస్ క్రీస్తు, గ్రామీణ వనిత వంటి నఖ చిత్రాలు ఈయన నఖచిత్ర కళా నైపుణ్యానికి నిదర్శనాలుగా నిలుస్తాయి. వీరు గీసిన చిత్రాలను అనేక తెలుగు దిన, వార పత్రికలు అలంకరించుకున్నాయి.

హెచ్.వి.రాంగోపాల్ గారి ఏకలవ్య శిష్యరికంలో వీరు శిల్పిగా కూడా రూపాంతరం చెందారు. కళాత్మక దృశ్యాలను పురాతన దేవాలయాలను, శిల్పాలను, ఫొటోల రూపంలో భద్రపరిచారు. అలాగే వివిధ శాసనాలకు సంబంధించిన ప్రతిలేఖనాలను తీయడంలో కూడా వీరికి విశేష అనుభవం వుంది.

ఆయన చేసిన, చేస్తున్న అపూర్వ కృషికిగాను అనేక అవార్డులు-సన్మానాలు పొందారు. జాతీయ చిత్రకారుడు కాపురాజయ్య వంటి వారి ద్వారా బహుమతులు అందుకున్న వీరు 1986లో జిల్లా స్థాయి ఉత్తమ అధ్యాపకునిగా అవార్డు అందుకున్నారు. వారి చిత్రాలు పలు విద్యా సంస్థల్లోనూ, గ్రంథాలయాల్లోనూ చిత్రకళా ప్రదర్శనలోనూ చోటు చేసుకుని పరిశోధనలకు అందుబాటులో వున్నాయి.

బహుముఖ ప్రజ్ఞాశాలి అయిన రెడ్డిబోయిన వారి 'కుంచె' జాతీయ స్థాయి పురస్కారాల రంగులు పులుముకోవాలని కోరుకుందాం.

- అమ్మిన శ్రీనివాసరాజు

అవసరమైనప్పుడల్లా రాష్ట్ర, జిల్లా, డివిజన్, మండల, గ్రామ స్థాయిల్లో శిక్షణా శిబిరాలు నిర్వహిస్తుంది. ఆ క్రమంలోనే జరిగింది సిరిపురం శిబిరం. 19 జిల్లాలకు ప్రాతినిధ్యం వహిస్తూ 86 మంది కళాకారులు ఈ శిబిరంలో తమ నైపుణ్యానికి మెరుగులు దిద్దుకున్నారు. తమకు తెలిసిన దరువులకు మరిన్ని మెళకువలు జోడించడంతో పాటు కొత్త దరువులు, కొత్త అడుగులు, కొత్త విన్యాసాలు తయారు చేశారు. ఎవరో ఒకరు నేర్పించడం మిగతా వారు నేర్చుకోవడం కాకుండా తమలోంచే అనుభవజ్ఞులైన కళాకారుల పర్యవేక్షణలో ఒకరినొకరు పంచుకుని, కొత్తదనాన్ని నింపుకున్నారు. 16 దరువులు 32 అడుగులు కొత్తగా సృష్టించారు. కళ్ళు చెదిరే విన్యాసాలు రూపొందించారు.

డప్పుతో ప్రజల్ని ఆకర్షించడమెలా, ఆనందంలో ముంచెత్తడమెలా, ఉత్సాహానికి ఊపిరి పోయడమెలా, ఉద్వేగంతో ఉరికించడమెలా, కళ్ళల్లో నిప్పులు కురిపించడమెలా, కర్తవ్యానికి కదిలించడమెలా... ఇలా ప్రతి అవసరానికి ఒక దరువు, ఒక అడుగు, రెప్పపాటులో జరిగిపోయే ఒళ్ళు గగుర్పొడిచే విన్యాసాలనేకం ఈ శిబిరంలో రూపుదిద్దుకున్నాయి. ఆ విన్యాసాల ప్రదర్శనలో ఏ మాత్రం ఏమరుపాటుగా వున్నా ప్రాణాలకే ప్రమాదం.. అయినా తెగించి సాధన చేశారు. జనం కోసం నేర్చుకున్నారు.. కళాకారులు ఆ పది రోజుల తమ కఠోర సాధనను చివరిరోజు జరిగిన బ్రహ్మాండమైన బహిరంగ సభలో జనం మధ్య ప్రదర్శించి పరీక్షకు పెట్టారు... ఫలితం సాధించారు... ప్రజల నీరాజనాలు అందుకున్నారు. తాము నేర్చుకున్న విద్యను రాష్ట్రమంతటా వెదజల్లడానికి, ప్రజలకు, ప్రజా సాంస్కృతికోద్యమ కార్యకర్తలకు అందించే కర్తవ్యాన్ని అందిపుచ్చుకున్నారు... అలా ఈ శిబిరంతో డప్పు మరింత పదునెక్కింది. రాబోయే పోరాటాలకు తనను తాను సిద్ధం చేసుకుంది. ఇక... డప్పు ఓ పోరాట పొలికేక...



ఉనికి కోల్పోతున్న సంక్రాంతి

మూకుమ్మడి టీవీ ఛానళ్ళ దండయాత్రల
వల్లనైతేనేం
ఇతరత్రా ఎలక్ట్రానిక్ మీడియా దాడుల పరంపర
వల్లనైతేనేం
వేకువ జామున కోడికూతల నడుమ
హరిదాసుల హరినామ సంకీర్తనలు
శిథిలమైనాయి.

సముద్రంలా ఘోషించే పాప్ సంగీతపు
హోరువల్లనైతేనేం
చెవులు చిల్లులు పడే ఇతరత్రా వెస్టన్ మ్యూజిక్
పోరువల్లనైతేనేం

వినసొంపైన బుడబుక్కలోళ్ళ
వింతవింత శబ్దాలు విధ్వంసమైనాయి.

ఆధునికతనే మేలిమి ముసుగును ధరించిన
ఎలుకల కలుగుల్లాంటి అపార్టుమెంట్ల ముంగిళ్ళలో
ఆడపడుచులు తీర్చిదిద్దే
రంగురంగుల ముగ్గులల్లికల ఆచూకీ లేదు.

అంతా ఫారిన్ ఫ్యాషన్ మయం
విదేశీ సంస్కృతి దిగుమతి మహాత్యం.

సందేహమేమీ లేదు
భారత సంస్కృతుల్ని సాంప్రదాయాల్ని
బుల్లి తెరలు నశింప చేస్తున్న క్షీణయుగమిది.

కోడి పందాలు లేవు
ఎడ్ల పందాలు లేవు
సంబరాల సంక్రాంతి ఉనికి తెలియడం లేదు.

టీవీల రిమోట్లు మీటుతూ
కంప్యూటర్ల బటన్లు నొక్కుతూ
రిమోట్లతో రోబోలకి పనిపురమాయించే
చలువరాతి మేడలోని
అత్యంతాధునిక మానవుడి అతి నాజూకు వేళ్ళలో
గోమయపు గొబ్బిళ్ళ శోభితాల్ని
వెతుక్కోవడం వ్యర్థమేననిపిస్తుంది

భోగిమంటాల్నార్పేసుకొని కూర్చున్న
ఓ ఈతరం మనిషి
నీవెన్ని తరాల సంస్కృతిని కోల్పోయావో
ఇప్పుడైనా ఆలోచించు.

- సంగిపాగి ఆనందరాజు

ADVOCATE

న్యాయసలహాలు

దావాలు ఎలా పరిష్కరించుకోవాలి ?

నాకు హైదరాబాద్ హైకోర్టు లో దావాలు వున్నవి. దావాలలో నాకు చాలా బలం వుంది. కాని నాకు అవి బెంచికి తెప్పించి విచారణ జరిపించుటకు శక్తి లేదు. కడు బీద స్థితిలో వున్నాను. అవి కడతేర్చుకొనేందుకు ఏమి చేయాలో తెలపగలరని ఆశిస్తున్నాను.

– జి.వెంకటేశ్వరరావు, రేపల్లె, గుంటూరు జిల్లా

మీరు దావాలు ఉన్నాయి అన్నారు. ఆ దావాలు దేనికి సంబంధించినవో రాయలేదు. కింది కోర్టులో గెలిచి, ఓడి అప్పీలుకొచ్చిన 'సివిల్' దావాలా? లేక ప్రభుత్వం వారి మీద వివిధ కారణాల వల్ల 'రిట్ పిటిషన్'లా అన్నది తెలుపలేదు. సివిల్ దావాలైతే మొదటి అప్పీలా? రెండవ అప్పీలా? మొదటి అప్పీలు అయితే హైకోర్టులో దాదాపు 10 సంవత్సరాలకు తుది విచారణకు వస్తుంది. రెండవ అప్పీలు అయితే 4 సంవత్సరాలకు తుది విచారణకు వస్తుంది. మీరు మీకు త్వరగా పరిష్కరించుకునే కారణాలు, వివరంగా వివరిస్తూ మీ దావాలోనే ఇంకో 'ఎక్స్‌పిడైట్' పిటిషన్ వేసి బెంచిమీదికి తెప్పించుకొని, సరైన కారణాలని న్యాయమూర్తిగారు భావిస్తే ఆరు నెలల లోపలనే మీ దావాలు పరిష్కరించబడతాయి. మీరు మీ ప్లీడర్‌ని కలిస్తే ఇవన్నీ స్వయంగా మీకు వివరిస్తారు.

కాలనీ వాళ్ళు కుట్ర చేశారు

మేము ఎస్.సి. కులమునకు చెందిన వారము. మాకు ఇర్లు స్థలం కావలెనని గుంటూరు ఎం.ఆర్.ఓ. గారికి 1997 సంవత్సరంలో అర్జీ పెట్టుకొనగా మా యొక్క అర్జీని పరిశీలించి మాకు ఒకటిన్నర సెంటు చొప్పున రెండు పట్టాలుగా మా ఇద్దరికి ఇచ్చినారు. ఆ స్థలమును బాగు చేసుకొని రెండు పూరిళ్ళు నిర్మించుకొని కాపురం ఉండగా అదే కాలనీలోని వారు కొంతమంది కుట్ర పన్ని మా పక్క ప్లాటు నెం.36ను, మాకు ఇచ్చిన పట్టాలోని ప్లాటు నెం.37గా దిద్ది మాపై దావా వేసి మా ఇళ్లను పీకి వేశారు. ఈ విషయం ఎమ్మార్వో గారికి, పై అధికారులకు తెలియజేసినాము. వారు పట్టించుకోలేదు.

లోయర్ కోర్టునందు మేము రెండు పట్టాలకు విడివిడిగా రెండు దావాలు, ప్రతివాది ఒక దావా వేశాము. మేము వేసిన రెండు దావాలు మాకు అనుకూలంగా వచ్చినవి. ప్రతివాది వేసిన దావా వారికి అనుకూలంగా వచ్చినది.

జిల్లా కోర్టు అప్పీలు నందు మొత్తం మూడు దావాలు మా ప్రతివాదికి అనుకూలంగా వచ్చినవి. వారు ఈ జడ్జిమెంట్ చూసుకొని మా స్వాధీనంలో వున్న స్థలమును కొంతమంది రౌడీలను వెంటబెట్టుకొని వచ్చి దౌర్జన్యంగా రేకుల షెడ్డు నిర్మించినారు. మేము అప్పీలుకు వెళ్తాం అని చెప్పినా పోలీసు వారు ప్రతివాదికి అనుకూలంగా వున్నారు.

మేము హైకోర్టుకు అప్పీలుకు వెళ్ళినాము. మేము 'స్టే' తీసుకొని ఆ యొక్క రేకుల షెడ్డు తొలగించవచ్చా లేదా? ఇంత జరుగుతున్నా ఎమ్మార్వో గారు, ఎన్ని పిటిషన్లు ఇచ్చినా పై అధికారులుగానీ పట్టించుకోలేదు. కనుక మా స్థలం మాకు ఇప్పించండి అని ఎమ్మార్వో గారి మీద దావా వేయవచ్చా లేదా? దావా వేస్తే ఎక్కడ వేయాలి.

ఫోర్జరీ చేసిన రెవెన్యూ రికార్డును పరిశోధనకు లాబ్‌కు పంపించమని కోర్టు వారిని అడగవచ్చా. ఈ విషయాలను మాకు తెలియజేయగలరు.

– సుశీల, గుంటూరు

మీ అధీనంలో వున్న ఆ స్థలాన్ని స్వాధీనం చేసుకోవడానికి ప్రతివాది వ్యక్తిగతంగా రౌడీల సహాయం తీసుకోకూడదు. అతను క్రింది కోర్టులో 'ఎక్స్‌క్యూషన్ పిటిషన్' వేసి మీ వద్దనుండి స్వాధీనం చేసుకోవాల్సి ఉంటుంది. మీరు హైకోర్టులో 'సెకండ్ అప్పీలు' వేశామన్నారు. మీరు ఆ కేసులో స్టే పొందితే ఆ రేకుల షెడ్డును తొలగించుకోవచ్చు. మీరు ఎమ్.ఆర్.ఓ. మీద ఎలాంటి దావా వేయజాలరు. కాని ప్రస్తుతం హైకోర్టులో పెండింగ్‌లో వున్న దావాలో మీరు ఒక పిటిషన్ వేసి మీ ప్రత్యర్థి ఫోర్జరీ చేసిన రెవెన్యూ రికార్డులను తెప్పించి పరిశీలించమని కోర్టువారిని అడగవచ్చు. అలా తెప్పించిన రికార్డు 'టాంపరింగ్' జరిగినట్లు కోర్టులో మీ తరపు వాదన వినిపించినట్లయితే మీకు లాభం చేకూరుతుంది.

అత్తింటి వారు మోసం చేశారు

నాకు ఆరు సంవత్సరాల క్రితం వివాహం అయ్యింది. ఇద్దరు పిల్లలున్నారు. కాని నా భర్త పూర్తిగా దొంగ, తాగుబోతు. తల్లిదండ్రులను విడిచి ఇంకో పట్టణంలో ఉన్నాడట. మూడు సంవత్సరాలు అయ్యింది. పోలీసు వారి ద్వారా రిపోర్టు పంపి నాకు ఇచ్చిన కట్నమిచ్చి వేస్తామని కాగితం రాసి మరింత వరకు చేరలేదు. మేము పోలీసు వారికి, కోర్టు వారికి 8 నెలల క్రితమే దరఖాస్తులు పెట్టి వాయిదాలకు తిరుగుచున్నా అతడుగాని, తల్లిదండ్రులు గాని ఇచ్చుటకు రాలేదు. అతను ఇంకొక వివాహం చేసుకున్నట్లు అక్కడ వారు చెబుతున్నారు. ఇప్పుడు వారిపై ఏమి కేసు వేయాలో దయ ఉంచి తెలపండి.

– కొమ్మూరి రేవతి, బొబ్బిలి.

మీ భర్తపై మీరు పోలీస్ స్టేషన్లో పెట్టిన కేసు ఏమిటో వివరంగా చెప్పలేదు. మిమ్మల్ని బాధ పెట్టారని పెడితే సెక్షన్ 498ఎ, ఐపిసి కిందకు వస్తుంది. కోర్టులో వేసిన దరఖాస్తు ఏమిటో కూడా చెప్పలేదు. మీరు కోర్టులో భరణం (మెయింటినెన్స్) పొందటానికి వేశారా? అలా వేస్తే మీరు భరణం ప్రతి నెల పొందగలుగుతారు. కాని వారి అభీష్టం లేకుండా భరణం పెద్ద మొత్తంలో ఒకేసారి పొందలేరు. అతను మళ్ళీ పెళ్ళి చేసుకుంటే సెక్షన్ 494ఐపిసి కింద అతడు, అతని తల్లిదండ్రులు, కొత్త భార్య తల్లిదండ్రులపై అందరిపై కేసు పెట్టవచ్చు.

– జి.ఎల్.నరసింహారావు
హైకోర్టు న్యాయవాది

రుచి

నువ్వుల ఉండలు

కావలసిన వస్తువులు:

తెల్ల నువ్వులు: ఒక కప్పు

బెల్లం: ఒక కప్పు

దాల్చినచెక్క పొడి: చిటికెడు

యాలకుల పొడి: చిటికెడు

చేసే విధానం: నువ్వులను మంచి సువాసన వచ్చే వరకూ వేయించాలి. వాటిని పక్కన పెట్టాలి. బెల్లంలో చాలా కొద్దిగా నీళ్లు పోసి అడుగు మందం ఉన్న గిన్నెలో వేడి చేయాలి. బెల్లం కరగగానే చిన్న మంటమీద ఉంచాలి. అందులో నువ్వులు వేసి పది నిముషాల పాటు అడుగంటకుండా తిప్పాలి. పాకం దగ్గరకు వచ్చి తరువాత దింపి కొంచెం వేడి తగ్గిన తరువాత ఉండలు చుట్టుకోవాలి.

కీరా, టమాటా చట్నీ



కావలసిన వస్తువులు:

కీరా: 150 గ్రాములు

టమాటాలు: వంద గ్రాములు

పచ్చిమిర్చి: 8

పచ్చి శనగపప్పు: టేబుల్ స్పూన్

జీలకర్ర: అర టేబుల్ స్పూన్

ఆవాలు: అరటేబుల్ స్పూన్

నూనె: రెండు టేబుల్ స్పూన్లు

చేసే విధానం: కీరాను తొక్క తీసి సన్న ముక్కలుగా కోసుకోవాలి. టమాటాలు, పచ్చిమిర్చిని తగినంత ఉప్పు వేసి పచ్చివి నూరాలి. ఇప్పుడు బాండీలో నూనెవేసి తాలింపు వేగిన తరువాత టమాటా, పచ్చిమిర్చి పేస్టును వేసి పచ్చి వాసన పోయే వరకూ వేయించాలి. దానికి కీరా ముక్కలను కలిపి దింపాలి.

ఆధునిక వ్యవసాయ పద్ధతులను వివరించేది
రైతాంగ సమస్యలకు పరిష్కారం చూపించేది

మన
రైతువాణి
మాసపత్రిక

సంవత్సర చందా
రూ. 100/-
చందాదారులు కండి.
2004 మన రైతువాణి డైరీ,
క్యాలెండర్ ఉచితంగా
పొందండి.

వ్యవసాయరంగ
సంక్షోభానికి, రైతు నష్టాలకు
కారణాలను విశ్లేషించి
పరిష్కారాన్ని చూపేది
మన
రైతువాణి

సంవత్సర చందాదారులకు మాత్రమే ఈ అవకాశం.

చందా మొత్తాన్ని మీకు దగ్గరలోని రైతు సంఘం ప్రతినిధులకు గాని, రైతు సంఘం కార్యాలయాలలోగాని చెల్లించండి.
పోస్టుద్వారా పొందగోరువారు రూ. 136 లు పంపాలి.

మా చిరునామా

మన రైతువాణి, 1-1-9/10, జవహర్‌నగర్, ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్, హైదరాబాద్ - 500 020
ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ప్రచురిస్తున్న రైతుల పత్రిక